ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట : 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు : 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు : 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి : 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు : 99890 59755



'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా నేడే

మూడు ప్రధాన బహుమతులతో పాటు 125 కన్సొలేషన్ కానుకలు

తిరుపతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అభిమాన పాఠకులు ఎదురుచూస్తున్న 'ఆంధ్రజ్యోతి లక్కీ డ్రా' మంగళవారం జరగనుంది. రేణిగుంట మండలం దామినేడు సమీపంలోని ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయంలో 'కార్ అండ్ బైక్ రేస్' అదృష్ట పాఠకులు ఎవరన్నది తేలనుంది. సాయంత్రం 4.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రముఖులు అతిథులుగా పాల్గొని పాఠకుల నుంచి వచ్చిన వేలాది కూపన్లలో విజేతలను ఎంపిక చేయనున్నారు. ప్రథమ బహుమతి కింద మోటార్ బైక్, రెండో బహుమతిగా రిఫ్రిజిరేటర్, మూడో బహుమతిగా టీవీని విజేతలకు అందజేయనున్నారు. మరో 125 కన్సొలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.2వేల విలువచేసే గృహోపకరణాలను అందిస్తారు.

2024 నవంబరు 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ మధ్య ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 12 కూపన్లను (4 సెట్లు) పాఠకులు ఇప్పటికే ఆంధ్రజ్యోతి కార్యాలయానికి పంపారు. వేల సంఖ్యలో ఈ కూపన్లు పంపగా, వీరిలో అదృష్టవంతులు ఎవరన్నది మంగళవారం తేలనుంది. డ్రాకు హాజరుకాలేని విజేతలకు ఫోన్ ద్వారా సమాచారం అందించడం జరుగుతుంది. ఈ కూపన్లు మళ్లీ విజయవాడలో జరిగే లక్కీడ్రాకు వెళతాయి. అక్కడి డ్రాలో గెలిచిన రాష్ట్ర విజేతకు మారుతి కారు బహుమతిగా దక్కనుంది.



సమయం : మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు
వేదిక : దామినేడు సమీపంలోని ఆంధ్రజ్యోతి ఎడిషన్ కార్యాలయం

వంద గ్రామాల పండుగ

నేడు, రేపు పుంగనూరు గంగ జాతర



సుగుటూరు గంగమ్మ

పుంగనూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట ఆరోగ్య వరప్రదాతగా పేరుగాంచిన పుంగనూరు గంగమ్మ జాతరను మంగళ, బుధవారాల్లో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి.జమిందారీ వంశస్తుల ఆధ్వర్యంలో ఈ జాతరను ఏటా హోలీపండుగ అనంతరం ఉగాది పండుగకు ముందు వచ్చే మంగళవారం పుంగనూరుతో బాటు పరిసర 100 గ్రామాల్లో ప్రజలు ఘనంగా నిర్వహించుకుంటారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భారీగా ప్రజలు తరలివస్తారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ జాతరలో అన్ని మతాల వారూ పాల్గొంటారు. జాతర సందర్భంగా పుంగనూరులో ఆలయాలు, ఇళ్లు రంగులతో ముస్తాబయ్యాయి.సోమవారం మున్సిపల్, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు.జమీందార్లు సోమశేఖర్ చిక్కరాయులు, మల్లిఖార్జున చిక్కరాయులతో కలిసి మున్సిపల్ కమిషనర్ మధుసూధన్‌రెడ్డి, పలువురు ప్రముఖులు గంగమ్మ ఆలయం వద్ద పూజలు చేశారు.



జాతర అలంకరణతో మెరిసిపోతున్న పుంగనూరు జమిందారీ ప్యాలెస్

జమీందార్ల ఇష్టదైవం

మధుర పాండ్యుల సంతతిగా సుగుటూరు నుంచి వచ్చిన పుంగనూరు జమీందార్లు పాలేగాళ్లుగా విజయనగరరాజుల కింద శిస్తు, జమానాలు వసూలు చేసేవారు.గంగమ్మను ఇష్టదైవంగా కొలిచే వీరు రాజ్యభాగ పరిష్కారం తరువాత పుంగనూరు చేరారు.సుగుటూరు గంగమ్మ విగ్రహాన్ని తీసుకొస్తుండగా ప్రస్తుతం గుడి ఉన్నచోట రథం ఇరుసు విరిగిపోవడంతో అక్కడే అమ్మవారి గుడిని నిర్మించి పూజా కార్యక్రమాలు చేయడం మొదలుపెట్టారు.అమ్మవారి పాదపీఠం కూడా అక్కడే లభించడంతో సుగుటూరు గంగమ్మను ఇంటి ఇలవేల్పుగా కొలుస్తూ ఏటా జాతర జరిపిస్తున్నారు. సుగుటూరు గంగమ్మను ఏడాదిలో ఒక్క రోజు మాత్రమే జాతర సందర్భంగా జనం మధ్యకు తీసుకువచ్చి పూజలు నిర్వహిస్తారు. మిగిలిన రోజుల్లో పుంగనూరులోని జమీందారి ప్యాలెస్‌లో వుంచుతారు. మంగళవారం ప్రారంభమయ్యే జాతర బుధవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు, నిమజ్జనంతో ముగుస్తుంది.శక్తి ఆలయాల్లోని 8 ప్రాంతాల్లో స్థిరపడిన సుగుటూరు గంగమ్మ సోదరీమణులైన అష్టగంగమ్మలకు జాతర సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకొంటారు. జాతరకు వారం రోజుల ముందుగానే తెలి, మలి చాటింపులతో ప్రజలకు తెలియజేస్తారు.మంగళవారం పుంగనూరులో భారీఎత్తున గొర్రెపొట్టేళ్ల సంత జరుగుతుంది.ప్యాలెస్ నుంచి అమ్మవారి విగ్రహాన్ని బయటకు తెచ్చి జమీందారి వంశీకులు రాత్రి కలశ ప్రతిష్ట, శాంతిపూజ నిర్వహించి తొలిపూజ చేస్తారు. తర్వాత వీఐపీలు పూజలు నిర్వహించాక అమ్మవారిని ప్రత్యేక వాహనంపై పురవీధుల్లో ఊరేగిస్తారు. పుంగనూరులో శక్తి ఆలయాలుగా 8 మూలల్లో స్థిరపడ్డ అష్ట గంగమ్మలైన పాత బస్టాండు సమీపంలోని విరూపాక్షి మారెమ్మ, తూర్పుపాలెంలో స్థలగంగమ్మ, పలమనేరు రోడ్డులోని మల్లారమ్మ, తూర్పు మొగసాలలోని నల్లగంగమ్మ, కట్టకిందపాళ్యంలోని పడమటి గంగమ్మ, పుంగమ్మకట్టపై నీళ్లరాళ్ల గంగమ్మ, కోనేరు వద్దగల బోయకొండ గంగమ్మలను పలకరిస్తూ ఊరేగింపు సాగుతుంది.తూర్పు మొగసాలలోని నల్లగంగమ్మ అనబడే నడివీధి గంగమ్మ ఊరేగింపులో కలుస్తుంది.బుధవారం తెల్లవారుజామున ప్యాలెస్ వద్ద గల సుగుటూరు గంగమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించి బెస్త, యాదవ, తోటి కులస్తులు ఘనంగా పూజలు చేస్తారు.బుధవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు తరువాత తూర్పు మొగసాలలో జలధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.తరువాత విగ్రహాన్ని జమిందారు ప్యాలెస్‌కు తీసుకెళ్లి భద్రపరుస్తారు.

విరూపాక్షి మారెమ్మ

సుగుటూరు గంగమ్మ తర్వాత బలమైన శక్తిదేవతగా విరూపాక్షి మారెమ్మ పేరుగాంచారు. బలులు తీసుకోవడంలో, పూజలు అందుకోవడంలో ముందుంటూ నిరంతరం భక్తులు సందర్శించే ఆలయంగా వెలుగొందుతోంది. ఈ నేపథ్యంలో మున్సిపల్ బస్టాండు సమీపంలోని మారెమ్మ ఆలయ ఆవరణలో, దండుపాళ్యం సమీపంలో, పలమనేరు రోడ్డులో ఓంశక్తి భక్తులు ఆలయాలను నిర్మించి నిత్య పూజలు నిర్వహిస్తున్నారు.



గెరిగెలతో మొక్కులు ప్రత్యేకం

సుగుటూరు గంగ జాతరలో గెరిగెలతో మొక్కులు తీర్చుకోవడం విశేషం.స్త్రీలు, పురుషులు, గంగవేషాలు వేసుకొని బెల్లం పానకం, పసుపునీళ్లు, మజ్జిగ, కుండల్లో నింపుకుని పైన రెండు మూరల ఎత్తు వరకు వేపాకు, పూలతో అలంకరించి నెత్తినపెట్టుకొని పురవీధుల్లో ప్రదర్శనగా వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. పాదమండపం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు.అమ్మవారికి జంతుబలులు సమర్పించి మంగళహారతులతో మొక్కులు తీర్చుకొంటారు. ఎనుపోతులు, గొర్రెపొటేళ్లు, మేకపోతులు, కోళ్లను అమ్మవారికి వేలసంఖ్యలో బలి ఇస్తారు.



జస్టిస్ ఎన్వీ రమణకు సత్కారం

న్యాయ వ్యవస్థ పటిష్ఠతకు కృషి చేయండి

మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ.రమణ

కుప్పం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థ పటిష్ఠతకు న్యాయవాదులు కృషి చేయాలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం బార్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు కుప్పం న్యాయస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో జరిగిన సమావేశంలో జస్టిస్ ఎన్వీ.రమణ మాట్లాడుతూ న్యాయవాదులు ఎవరైనా సరే న్యాయం పక్షమే వహించాలని, న్యాయమూర్తులు న్యాయాన్యాయాల విచారణలో చట్టాలను అనుసరించి వెళ్లాలని ఉద్బోధించారు. శిథిలావస్థలో ఉన్న కోర్టు భవన దుస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి నూతన భవన ఆవశ్యకత గురించి తెలియజేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ తరఫున జస్టిస్ ఎన్వీ రమణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, జూనియర్ సివిల్ జడ్జి వరుణ తేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసీ.చంద్రప్ప, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి ఉదయకుమార్, న్యాయవాదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమరావతి సదస్సుకు కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సచివాలయ వేదికగా మంగళ, బుధవారాల్లో జరిగే కలెక్టర్ల సదస్సులో పాల్గొనేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం సాయంత్రం బయల్దేరి వెళ్లారు. ప్రభుత్వంలో కీలకమైన 30 శాఖలకు సంబంధించి జిల్లాలో గత మూడు నెలల కాలంలో జరిగిన అభివృద్ధి, లక్ష్యసాధనపై కలెక్టర్ ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశం ఉంది. 2047లో పెట్టుకున్న లక్ష్యాల సాధనకు జిల్లా యంత్రాంగం దశలవారీగా ఏం చేయనుందో నివేదికలో పేర్కొన్నారు.సదస్సులో ఎస్పీ మణికంఠ కూడా పాల్గొంటారు.

భానుడి ప్రభావం తీవ్రం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎండల ధాటికి రహదారులు బోసిపోతున్నాయి. సోమవారం అత్యధికంగా నింద్రలో 39.7డిగ్రీలు, అత్యల్పంగా పుంగనూరులో 32.9డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఎస్ఆర్‌పురంలో 39డిగ్రీలు, తవణంపల్లెలో 38.7, నగరి 37.3, పులిచెర్లలో 37.9, గంగాధరనెల్లూరు, పలమనేరులో 36, చిత్తూరు, గుడిపాలలో 36.9, గంగవరం, గుడుపల్లెలో 35.9, రొంపిచెర్ల, చౌడేపల్లె, విజయపురం, ఐరాల, పాలసముద్రం, పెనుమూరు, సదుంలో 35.8, బంగారుపాళ్యంలో 35.5, శాంతిపురం, సోమలలో 35.4, వెదురుకుప్పంలో 35.3, పెద్దపంజాణిలో 35.2, వీకోటలో 35.1, పూతలపట్టులో 34.5, యాదమరిలో 34.7, కార్వేటినగరం, కుప్పం ప్రాంతాల్లో 33.8, రామకుప్పం, బైరెడ్డిపల్లె ప్రాంతాల్లో 33.6డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



చిత్తూరులో బోసిపోయిన దర్గా సర్కిల్

నేడు కాణిపాకంలో పంచాంగం ఆవిష్కరణ

ఐరాల(కాణిపాకం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో మంగళవారం ఆలయం నుంచి మొట్టమొదటి సారిగా పంచాంగం ఆవిష్కరణ చేయనున్నట్లు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయం ద్వారా పంచాంగాన్ని ప్రచురించినట్లు పేర్కొన్నారు. ఉదయం 8.30 నుంచి 11 గంటల మధ్య ప్రధాన ఆలయంలోని కల్యాణ వేదిక వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివరించారు. ఆలయ ఉభయదారులు, పరిసర గ్రామస్తులు, భక్తులు హాజరు కావాలని కోరారు.

నేను బాసు మనిషిని!

- చిలక్కొట్టుడులో ఆ సీఐ ప్రత్యేకం
- ప్రతి పనికీ స్టేషన్‌లోనే లావాదేవీలు
- ప్రజాప్రతినిధులనూ లెక్కపెట్టని వైనం
- దొంగ నుంచి రూ.లక్షలు వసూలు చేసినా ఇప్పటిదాకా చర్యలు శూన్యం
- గతంలోనూ ఎర్రచందనం తరలిస్తూ సస్పెండైన వైనం



చిత్తూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల్ని బుట్టలో పడేయడంలో సిద్ధహస్తుడైన ఆ సీఐ గతంలో ఉన్నతాధికారి కోసం ఎర్రచందనం దుంగల్ని తరలిస్తూ అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డారు. ప్రస్తుతం చిత్తూరులో ఓ కీలకమైన స్టేషన్‌లో పనిచేస్తున్న ఆ సీఐ ఇప్పుడూ ఉన్నతాధికారి పేరు చెప్పుకుని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.'ఎమ్మెల్యే, ఎంపీ.. ఎవడైనా నన్నేం చేయలేడు. నా వెనుక బాసున్నాడు. నాకేమైనా అయితే ఆయనే చూసుకుంటాడు' ...ఇవీ ఆ సీఐ నోట నిత్యం వినిపించే మాటలు. అనుకున్నట్టే స్టేషన్‌లోనే పంచాయితీలు పెట్టడం, బెదిరించి రూ.లక్షలు వసూలు చేయడం నిత్యకృత్యమైపోయింది.తాజాగా ఓ దొంగ నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన విషయం బయటికి పొక్కినా ఇతనిపై చర్యలు లేకపోవడంతో నిజంగానే ఉన్నతాధికారి అండ ఉందని పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది.

గతంలో ఎర్రచందనం దుంగల్ని తరలిస్తూ..

ఉన్నతాధికారుల్ని ప్రసన్నం చేసుకునే ఈ సీఐ గతంలో ఎర్రావారిపాలెం ఎస్ఐగా పనిచేస్తున్నప్పుడు కూడా ఉన్నతాధికారి పేరు చెప్పి.. ఎర్రచందనం దుంగల్ని తరలిస్తూ అటవీశాఖ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు.అప్పట్లో కేసు నమోదవగా సస్పెండయ్యారు. ఈ కారణంగానే ఆయన బ్యాచ్ వాళ్లంతా డీఎస్పీలుగా పనిచేస్తుంటే, ఆయన మాత్రం సీఐగానే ఉండిపోయారు.

● దొంగ నుంచి డబ్బు వసూలు నిజమే..

గతేడాది చిత్తూరు నగరంలో తాళం వేసిన ఇంటిని పగులగొట్టి ఓ దొంగ రూ.లక్షల్లో నగదు, అర కిలోకు పైగా బంగారు ఆభరణాలను చోరీ చేశాడు. నిందితుడిని బెంగళూరులో పట్టుకున్న పోలీసులు కొంత నగదు, నగలు సీజ్ చేసి అరెస్టు చూపించారు. తాజాగా ఆ దొంగ రాయచోటి పోలీసులకు దొరకగా, ఓ దొంగతనానికి సంబంధించి చిత్తూరు సీఐకి రూ.12.50 లక్షలు ఇచ్చినట్లు అంగీకరించాడు. కొంత మొత్తాన్ని క్యాష్‌గా, మరికొంత మొత్తాన్ని ముగ్గురు కానిస్టేబుళ్లకు ఫోన్ పే ద్వారా చెల్లించినట్లు తెలుస్తోంది. మధ్య స్థాయి అధికారి విచారించి వసూలు చేసింది నిజమే, కానీ 12.50 లక్షలు కాదు, రూ.6 లక్షలే అని నిర్ధారించినట్లు సమాచారం. ఈ విషయం ఆయన చెప్పుకుని తిరిగే ఉన్నతాధికారి దృష్టికీ వెళ్లింది. విచారణకు ఆదేశించారు. 10 రోజులవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.డబ్బిచ్చిన దొంగ అందుబాటులో ఉన్నాడు, తీసుకున్న సీఐ.. ముగ్గురు కానిస్టేబుళ్లు ఉన్నారు, కళ్ల ముందే అందరూ ఉన్నా, తప్పు జరిగిందా లేదా అని నిర్ధారించడానికి 10 రోజులు అవసరమా అనేది చర్చ జరుగుతోంది. సీఐకి ఉన్నతాధికారి అండ ఉండడంతోనే విచారణ ముందుకు సాగడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

సీఐ చిలక్కొట్టుడులో కొన్ని....

● తన స్టేషనులోని ఓ కానిస్టేబుల్ ద్వారా నగరంలోని ప్రతి లాడ్జి నుంచీ నెలకు రూ.10 వేల చొప్పున వసూలు ● గత నెలలో సంతపేటకు చెందిన ఓ యువకుడు గంజాయి సేవిస్తుండగా.. స్టేషన్‌కు పట్టుకొచ్చి అమ్ముతున్నావని బెదిరించారు. రూ.లక్ష డిమాండ్ చేయగా.. రూ.75 వేలకు బేరం కుదిరింది. తీసుకుని వదిలేశారు ● మద్యం దుకాణాల యజమానుల్ని స్టేషన్‌కు పిలిచి నెల మామూళ్లు ఇవ్వాలని బెదిరించారు ● ఓ ఇంట్లో పనికొచ్చిన వ్యక్తి ఇటీవల పనిచేస్తూ మిద్దెపైనుంచి పడి మృతి చెందాడు. యజమానిని బెదిరించి రూ.3 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం ● గతేడాది ఆగస్టులో మూడు గ్రానైట్ లారీలను సీజ్ చేశారు. రూ1.50 లక్షల చొప్పున ఫైన్ వేస్తానని బెదిరించి రూ.లక్షకు బేరం మాట్లాడారు. అంత ఇవ్వలేమని, అవసరమైతే ఆ రాయిని మీరే అమ్ముకోండి.. లారీలను మాత్రం వదిలేయండి.. అంటూ అడుక్కున్నా నాలుగు రోజులు వేధించి రెండు లారీల నుంచి రూ.75 వేల చొప్పున, మరో లారీ నుంచి రూ.50 వేలు చొప్పున వసూలు చేశారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:29 (మంగళవారం సాయంత్రం)
సహర్: 4:55 (బుధవారం ఉదయం)

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు

● ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ మణికంఠ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. క్రికెట్ ఆటను ఆస్వాదించడం తప్పుకాదని, బెట్టింగ్‌లు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. బెట్టింగ్ వల్ల అనేక మంది ఆర్థికంగా నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోయి కుటుంబాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే గ్యాంగ్‌లపై నిఘా ఉంచామన్నారు. బెట్టింగ్ ముఠాల చేతిలో మోసపోయిన వారు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలపారు. అలాగే క్రికెట్ బెట్టింగ్‌పై సమాచారం తెలిస్తే 112 లేదా చిత్తూరు పోలీసు వాట్సాప్ నెంబరు 94409 00005 సమాచారం ఇవ్వాలని కోరారు.

టెన్త్ గణిత పరీక్షకు 562 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులకు సోమవారం గణితం పరీక్ష జరిగింది. 22,120 మంది విద్యార్థులకు 21,558 మంది హాజరవగా, 562 మంది గైర్హాజరైనట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. రెగ్యులర్ టెన్త్‌లో 21,080 మందికి 20,866 మంది హాజరవగా, 214 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ స్కూల్‌లో 1040 మందికి 692 మంది హాజరవగా, 348 మంది గైర్హాజరయ్యారు. డీఈవో రెండు కేంద్రాలు తనిఖీ చేయగా, 15 ఫ్లయింగ్ స్క్వాడ్లు 18 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాయి. 65 కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్లు విధులు నిర్వహించాయి.


నటుడు సుమన్

కోరుకున్నదానికన్నా దేవుడు ఎక్కువే ఇచ్చాడు

● సినీ నటుడు సుమన్

తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): 'నేను కోరుకున్నదానికంటే దేవుడు నాకు ఎక్కువే ఇచ్చాడు' అని సినీనటుడు సుమన్ అన్నారు. ఎలాంటి సినిమా బ్యాగ్రౌండ్ లేని తాను తన తల్లిదండ్రులు చేసిన పుణ్యఫలంగా మంచి స్థాయికి ఎదిగానన్నారు. తన జీవితంలో ఏది జరిగినా, తాను ఏం చేసినా అది స్వామి లీలేనన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిగా, శ్రీరాముడిగా, సత్యనారాయణస్వామిగా దేవుడి పాత్రల్లో నటించడం గొప్పవరమన్నారు. స్వామి ఆశీస్సులతో అనేక సినిమాల్లో తాను బిజీగా గడుపుతున్నానని చెప్పారు. తొలిసారిగా తుళు భాషలో నటిస్తున్నాని సుమన్ తెలిపారు. అలాగే కాంత, సత్యంగారి అబ్బాయి, ధర్మస్థల నియోజకవర్గం అనే మూడు సినిమాల్లో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నాని, ప్రస్తుతం 'కాంత' చిత్ర షూటింగ్ గుజరాత్‌లో జరుగుతోందన్నారు.

తిరుమలేశుని సేవలో శిరూర్ మఠాధిపతి



తిరుమల, మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఉడిపిలోని శిరూర్ మఠాధిపతి వేదవర్ధనతీర్థ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అర్చక బృందం, పేష్కార్ రామకృష్ణ ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన స్వామి ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.94 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,198
తలనీలాలు సమర్పించినవారు: 25,665



● 2024-25 ఏడాదికి టీటీడీ రూ.5,141.74 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. సవరించిన అంచనాల మేరకు రూ.5,179.85గా పేర్కొంది. తాజాగా 2025-26 బడ్జెట్ అంచనాలో రూ.5,258.68 కోట్లు. ఈ ఏడాది బడ్జెట్ అంచనా స్వల్పంగా రూ.78.83 కోట్లు పెరిగింది.

హుండీ.. వడ్డీ

టీటీడీకి ప్రధాన ఆదాయ వనరులివే
స్వల్పంగా పెరిగిన ఆదాయ అంచనా



తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): టీటీడీ తాజాగా ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్‌లోనూ శ్రీవారి హుండీ, వడ్డీ ద్వారానే ఆదాయం భారీగా సమకూరుతుందని అంచనా వేసింది. గడిచిన ఏడాది హుండీ ద్వారా రూ.1,611 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేయగా, రూ.1,671 కోట్ల కానుకలు లభించాయి. ఈక్రమంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1,729 కోట్ల హుండీ ఆదాయం లభిస్తుందని టీటీడీ అంచనా వేసింది. రూ.900 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్లలోపు ఉండే హుండీ ఆదాయ అంచనాలు కొవిడ్ అనంతరం భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో 2022-23 బడ్జెట్‌లో హుండీ ద్వారా రూ.వెయ్యి కోట్లు లభిస్తుందని అంచనా వేయగా ఎవరూ ఊహించని విధంగా రూ.1,613 కోట్లు లభించింది. అలాగే 2023-24కి గాను రూ.1,611, 2024-25కి గాను రూ.1,671 కోట్ల అదాయం లభించింది.

● మరోవైపు వడ్డీల ద్వారా గతేడాది రూ.1,167 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేయగా, రూ.1,253 కోట్లు లభించింది. ఈక్రమంలో నూతన బడ్జెట్‌లో రూ.1,310 కోట్లు వడ్డీల ద్వారా లభిస్తుందని టీటీడీ అంచనా వేస్తోంది. కొవిడ్ ముందు వరకు వడ్డీల ద్వారా కేవలం రూ.800 కోట్లలోపే సమకూరేది.

● దర్శనంపై గతేడాది రూ.338 కోట్లు లభిస్తుందని టీటీడీ అంచనా వేసినప్పటికీ రూ.305 కోట్లు మాత్రమే సమకూరింది. దీంతో 2025-26 వార్షిక ఏడాదికి కేవలం రూ.310 కోట్లు మాత్రమే వస్తుందని అంచనా వేశారు.

● ప్రసాదాల ద్వారా రూ.600 కోట్లు లభిస్తుందని గతేడాది భావించగా రూ.50 కోట్లు తగ్గింది. అయినప్పటికీ రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.600 కోట్లు వస్తుందని భావిస్తున్నారు.

● గతేడాది ఇంజినీరింగ్ పనులకు, ఇంజనీరింగ్ నిర్వహణకు రూ.540 కోట్లు కేటాయించినప్పటికీ రూ.500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. తాజా వ్యయాల అంచనాలోనూ రూ.500 కోట్లే కేటాయించారు.

● గతేడాది గరుడవారధి నిర్మాణానికి రూ.53 కోట్లు కేటాయించినప్పటికీ రూ.25 కోట్లే ఖర్చు చేశారు. దీంతో తాజా బడ్జెట్‌లో రూ.28 కోట్లు కేటాయించారు.

● గడిచిన ఏడాది ధార్మిక ప్రచారానికి రూ.131.50 కోట్లు ఖర్చు కాగా, నూతన బడ్జెట్‌లో రూ.10 కోట్లు తగ్గించారు.

బడ్జెట్‌లో పొందుపరిచిన అంచనాల వివరాలు

ఆదాయాల అంచనా..	(రూ.కోట్లలో)
ప్రారంభనిల్వ	488.90
హుండీ	1,729
వడ్డీ	1,310
ప్రసాదాలు	600
దర్శన టికెట్లు	310
ఆర్జితసేవలు	130
అద్దెగదులు, కల్యాణమండపాలు	157
తలనీలాల వేలం	176.50
రుణాలు, సెక్యూరిటీ-డిపాజిట్లు తదితరాల ద్వారా	76.38
ట్రస్టులు	90
అద్దెలు, విద్యుత్‌బిల్లులు, వాటర్ బిల్లులు	66
ప్రచురణల విక్రయాలు	31
ఇతర ఆదాయాలు(అగర్‌బత్తి, టోల్‌గేట్ వంటివి)	93.90
	5,258.68

వ్యయాల అంచనా..	(కోట్లలో)
మానవ వనరులు	1,773.75
వస్తువుల కొనుగోళ్లు	768.50
కార్పస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్	800
ఇంజినీరింగ్ పనులు	350
గరుడవారధి	28
స్విమ్స్ ఆస్పత్రి ఇంజినీరింగ్ క్యాపిటల్ వర్క్స్	60
స్విమ్స్ రెవెన్యూ గ్రాంట్స్	60
ఇంజినీరింగ్ నిర్వహణ పనులకు	150
ఫ్యాకల్టీ మేనేజ్‌మెంట్ సర్వీస్	80
ఇతర సంస్థలకు గ్రాంట్స్	130
హిందూధార్మిక ప్రచారానికి	121.50
రుణాలు, ముందుగా ఉద్యోగులకు చెల్లింపులు, ఈఎమ్‌డీ, సెక్యూరిటీ డిపాజిట్స్	177.62
పెన్షన్ ఫండ్ కాంట్రిబ్యూషన్స్	100
విద్యుత్ ఉత్పత్తికయ్యే వ్యయం	70
కాంట్రిబ్యూషన్స్ టు స్టేట్ గవర్నమెంట్	50
ఇతర క్యాపిటల్ పనులు	52.50
ఇతర చెల్లింపులు	50.08
ఇతర నిర్వహణ ఖర్చులు	40
ప్రకటనలు	8
క్లోజింగ్ క్యాష్, బ్యాంక్ నిల్వ	448.73
	5,258.68 కోట్లు


తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశంలో చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు

ఉద్యోగుల సిఫార్సులకు 'సుపథం' ద్వారా శ్రీవారి దర్శనం

● టీటీడీ కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కమిటీ
● తిరుపతిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి రూ.కోటి

తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): టీటీడీ శాశ్విత ఉద్యోగుల సిఫార్సు లేఖలపై మూడు నెలలకోసారి సుపథం ద్వారా ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పించాలని తీర్మానించినట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. సమావేశానికి ముందు టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. బోర్డులో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వెల్లడించారు.

● తమకొచ్చే రూ.43 వేల జీతంలో జీఎస్టీ పేరుతో రూ.4,800 కోత విధిస్తున్నారని, మొత్తం జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని పోటు కార్మికులు కోతల్లేకుండా జీతాలు అందించాలని తీర్మానించాం.

● తిరుమలకు వచ్చే వీఐపీ, నాన్ వీఐపీలకు మంచి వసతి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో 12 బ్లాకుల్లోని 1,875 గదుల మరమ్మతులకు రూ.26 కోట్లు కేటాయించాం. మరికొన్నింటిని పూర్తిగా తొలగించి తిరిగి నిర్మించాల్సి ఉంది. మొత్తం 424 బ్లాకుల్లోని గదులను ఆధునీకరిస్తాం.

● తిరుమలలో లైసెన్సు లేకుండా ఉన్న దుకాణాలు, తట్టలను తొలగించేలా రెవెన్యూ, విజిలెన్స్ విభాగాలతో టాస్కఫోర్స్‌ను ఏర్పాటు చేస్తాం.

● టీటీడీ కళాశాల్లో 25 ఏళ్లుగా పనిచేస్తున్న 151 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్య పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

● తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులకు రూ. కోటి మంజూరు చేయాలని ఆమోదం తెలిపాం.

● జాతీయ బ్యాంకుల్లో టీటీడీ డిపాజిట్లపై మరోసారి బోర్డులో చర్చించాం. అధిక వడ్డీలు వచ్చేలా గుర్తింపు కలిగిన బ్యాంకుల్లోనే డిపాజిట్లు పెట్టే అంశంపై పరిశీలిస్తున్నాం.

● తిరుమలలో స్థలాక్రమణలకు పాల్పడుతున్న మఠాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. త్వరలో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

● టీటీడీ ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ అంశంపై పరిశీలించాలని అధికారులను బోర్డు కోరింది.

● కాశి మఠానికి నిత్యహారతులకు అనుమతివ్వాలని తీర్మానించాం.

హరియాణా మద్యం కేసులో కారు డ్రైవర్ ఎక్కడ?

● ప్రధాన పాత్రధారిని పట్టుకోవడంలో మీనమేషాలు
● ఎక్సైజ్ అధికారుల దర్యాప్తుపై విమర్శలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హరియాణా మద్యం కేసులో ప్రధాన పాత్రధారి, కారు డ్రైవరు చల్లా శ్రీనివాసులురెడ్డి ఎక్కడ? 11 రోజులుగా ఇతడు దొరకలేదా? అతడిని పట్టుకునే దిశగా గట్టి ప్రయత్నాలు జరగలేదా? ఇదీ ఈ కేసుకు సంబంధించి ఎదురవుతున్న ప్రశ్నలు. హరియాణాలో అతి తక్కువకు మద్యం దొరకడం.. ఇక్కడితో పోలిస్తే దాదాపు రూ.700 వ్యత్యాసం ఉండటంతో దీనిని అక్రమ సంపాదనగా మార్చుకున్నాడు ఆ రాష్ట్రానికి చెందిన గజేంద్ర శర్మ. తిరుపతిలో ఉంటున్న కూల్‌డ్రింక్ షాపు యజమాని బాబునూ భాగస్వామిగా చేసుకున్నాడు. గజేంద్రశర్మకు అన్నివిధాలుగా రూట్ అధికారిగా ఉంటూ, అన్నీ తానై ముందుండి నడిపించాడు కారు డ్రైవర్ చల్లా శ్రీనివాసులురెడ్డి. ఢిల్లీ మీదుగా మద్యాన్ని తీసుకొచ్చి గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, తిరుపతిలలో విక్రయించేవారు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీన ఎక్సైజ్ అధికారులు ముందస్తు ప్లాన్‌తో భారీఎత్తున హరియాణా మద్యం స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి, హరియాణాకు చెందిన గజేంద్ర శర్మ, కూల్‌డ్రింక్ షాపు దుకాణదారు బాబును అరెస్టు చేశారు. అప్పట్నుంచి కారు డ్రైవరు శ్రీనివాసులురెడ్డిని పట్టుకోలేకున్నారు. సమగ్ర విచారణతో ఇతడిని పట్టుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు.. ఆ దిశగా చర్యలు లేవన్న విమర్శలు వినవస్తున్నాయి. మరోవైపు ఇద్దరు అరెస్టయినా, హరియాణా మద్యం విక్రయాలు మాత్రం ఆగలేదు. తిరుపతిలోని గజేంద్రశర్మ అనుచరులు ఇద్దరు ఆదివారం సత్యనారాయణపురంలోని ఇద్దరికి హరియాణా మద్యం విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా అక్రమంగా నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం అక్రమాలు సాగడం వెనుక కొంతమంది పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది హస్తం ఉందన్న ప్రచారమూ జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు దర్యాప్తులో వేగం పెంచి కారు డ్రైవరును అదుపులోకి తీసుకుని.. హరియాణా మద్యం వ్యాపారాన్ని అరికట్టాల్సి ఉంది.

నాయుడుపేటలో వైసీపీకి భారీ షాక్

● పార్టీ వీడిన ముగ్గురు కౌన్సిలర్లు, మరికొందరు నేతలు


ఎమ్మెల్యే విజయశ్రీ, నరసింహయాదవ్, నెలవల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నాయుడుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో వైసీపీకి షాక్ తగిలింది. ముగ్గురు కౌన్సిలర్లు, నాయకులు ఆ పార్టీని వీడి.. సోమవారం రాత్రి టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సమక్షంలో ఆ పార్టీలో చేరారు. 2021 ఎన్నికల్లో 25కు 23 మంది కౌన్సిలర్లు వైసీపీ నుంచి గెలిచారు. ఎన్నికల సమయంలో వైస్ చైర్మన్ రఫీ టీడీపీలో చేరారు. వైసీపీలో గ్రూపు రాజకీయాలతో కొందరు నాయకులు, కౌన్సిలర్లు సతమతమవుతూ వచ్చారు. ఈ క్రమంలో సోమవారం కౌన్సిలర్లు మల్లు నీరజ, ఆబోతుల మస్తానమ్మ, కరీంబాయి విజయలక్ష్మితో పాటు మొదలియార్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కరీంబాయి చెంచయ్య, జువ్వలపాళెం సర్పంచ్ రమణయ్య, మాజీ కౌన్సిలర్ ఆబోతుల బాబు, వైసీపీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తెమ్మాని హరిరెడ్డి, సీహెచ్ రాజేష్ తదితరులు టీడీపీలో చేరారు.

'సాగరమాల' రోడ్డు పనుల అడ్డగింత

● సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలంటూ రైతుల ఆందోళన

నాయుడుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట మండలం చిలమత్తూరు వద్ద సోమవారం సాగరమాల రోడ్డు పనులను రైతులు అడ్డుకొన్నారు. గతంలో నరసారెడ్డికండ్రిగ వద్ద పనులను అడ్డుకొన్న విషయం తెలిసిందే. 'సాగరమాల రోడ్డు 13 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్నారు. దీనికి రెండువైపులా మాకు పొలాలు ఉన్నాయి. అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసిన చోట్ల నుంచి సర్వీస్ రోడ్డే ఏర్పాటు చేస్తే పొలాలకు వెళ్లే వీలుంటుంది. ఆయా గ్రామాల ప్రజలకూ అనువుగా ఉంటుంది. లేకుంటే పొలాలకు వెళ్లే దారిలేకుండా పోతోంది. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తాం' అని రైతులు చెప్పారు. ఈ ఆందోళనలో జలదంకి వెంకటకృష్ణారెడ్డి, సన్నారెడ్డి హరనాథ్‌రెడ్డి, వాకాటి సుధాకర్‌రెడ్డి, రత్నయ్య, బాలాజీ, రమణయ్య, శ్యామ్‌కుమార్‌రెడ్డి, కామిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, చంద్రమోహన్, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులున్నారు.

తాత్కాలిక మెడికల్ కౌన్సిల్‌లో తిరుపతి వైద్యుడికి చోటు

తిరుపతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ తాత్కాలిక మెడికల్ కౌన్సిల్‌లో సభ్యుడిగా తిరుపతి వైద్యుడు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు నియమితులయ్యారు. ప్రముఖ రేడియాలజిస్టు అయిన ఈయన గతంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా కూడా పని చేశారు. కొంతకాలంగా రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ పూర్తిస్థాయిలో నియామకం జరగలేదు. రోజువారీ కార్యలాపాల నిర్వహణ కష్టంగా మారింది. దీంతో ప్రభుత్వం సోమవారం మెడికల్ కౌన్సిల్‌ను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసింది. అందులో వైద్య కళాశాలల నుంచీ బోధనా సిబ్బంది కోటాలో ఇద్దరు, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కోటాలో నలుగురి చొప్పున ప్రభుత్వం తాత్కాలిక కౌన్సిల్‌లో సభ్యులుగా నియమించింది. శ్రీహరిరావు రిజిష్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కోటా నుంచీ ఎంపికయ్యారు.

ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్ట్


శివమణి గోవింద

మంగళం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా జమునమిత్త్రూరు మండలం నల్లపట్టు గ్రామానికి చెందిన శివమణి గోవిందం(35) అలియాస్ శివమణిపై పీడీయాక్ట్ అమలుకు ఆదేశాలు జారీ అయ్యాయని టాస్క్‌ఫోర్సు హెడ్ సుబ్బరాయుడు తెలిపారు. శివమణిపై పీడీయాక్టు అమలుకు సిఫార్సు చేయగా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్ అనుకూలంగా స్పందిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ క్రమంలో శివమణిని కడప సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

మంగళం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శేషాచల కొండల్లో ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సీసీఎఫ్ సెల్వం అధికారులకు సూచించారు. సోమవారం తిరుపతి బయోట్రీమ్‌లో జరిగిన అటవీశాఖ, టాస్క్‌ఫోర్సు అధికారుల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి శేషాచల కొండల్లోకి ప్రవేశిస్తున్న స్మగ్లర్లను ముందుగానే పసిగట్టి రానివ్వకుండా కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డ వారిపై పీడీయాక్టు ప్రయోగించాలన్నారు. ఇపుడు స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డ వారికి కఠిన శిక్షలు పడుతున్నాయన్నారు. తిరుపతిజిల్లా అటవీశాఖ అధికారి వివేక్, టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, మూడు సర్కిల్లోని అధికారులు పాల్గొన్నారు.

తీర ప్రాంత భద్రతకు సీఐఎస్‌ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ



తడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో తీర ప్రాంతాల భద్రత కోసం సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సైక్లోథాన్ ర్యాలీ సోమవారం సూళ్లూరుపేటకు చేరింది. హోలిక్రాస్ కూడలి వద్ద జాతీయ రహదారిపై షార్, రెవెన్యూ అధికారులు, పోలీసులు వీరికి స్వాగతం పలికారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా తడ మండలం అక్కంపేట వద్దనున్న జైన్ టెంపుల్‌కు చేరుకొన్నారు అక్కడ ఇస్రో అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ర్యాలీ సిబ్బందికి షార్ డైరెక్టర్ రాజరాజన్, నాయుడుపేట డీఎస్పీ స్వాగతం పలికి అభినందించారు. మార్చి 7న కోల్‌కత్తా నుంచి ప్రారంభమైన సైక్లోథాన్ ర్యాలీ.. మార్చి 31న కన్నియాకుమారికి చేరడంతో ముగుస్తుందని శ్రీహరికోట సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సంజిత్ కుమార్ తెలిపారు. సముద్ర మార్గాల్లో ఉగ్రవాదుల చొరబాటు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. అనంతరం ర్యాలీ తమిళనాడులోకి ప్రవేశించింది. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసుల రెడ్డి, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏడాదికల్లా జిల్లాను టీబీ ఫ్రీగా మారుద్దాం

● ప్రతిజ్ఞ చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ హేమలత తదితరులు

చిత్తూరు రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాదికంతా జిల్లాను టీబీ ఫ్రీగా మారుద్దామని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో టీబీ నివారణ అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పాల్గొన్నారు. అనంతరం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన టీబీ నివారణ దినం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. టీబీని సరైన సమయంలో గుర్తిస్తే మందులు ద్వారా సులభంగా నయం చేసుకోవచ్చని చెప్పారు. డీఎంహెచ్‌వో సుధారాణి, జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ మాట్లాడారు. జిల్లాలో 2531 టీబీ కేసులు ఉన్నాయన్నారు. అనంతరం టీబీ ఫ్రీగా ఎంపికైన 19 పంచాయతీల ఎంపీహెచ్‌వోలకు, సర్పంచులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత తదితరులు పాల్గొన్నారు.

టీబీ ఫ్రీ పంచాయతీల వివరాలు

కేఎం కండ్రిగ (బంగారుపాళ్యం మండలం), ఓటేరుపల్లె (యాదమరి మండలం), ఏఎంపురం (ఎస్ఆర్‌పురం మండలం), చీకటిపల్లె (గుడుపల్లె మండలం), వనగుట్టపల్లె (కుప్పం మండలం), 30 సోనిగానిపల్లి, అనికెర, సి.బండపల్లె (శాంతిపురం మండలం), ఆరూరు, మేళంబాకం (నింద్ర మండలం) పసుపాతూరు (గంగవరం మండలం), జగమర్ల (పలమనేరు మండలం), చమనేరు, లింగాపురం, పెద్దిరికుంట (పెద్దపంజాణి మండలం), ఈతూరు (పుంగనూరు మండలం), నన్నూరివారిపల్లె, పోలంవారిపల్లె, మతుకువారిపల్లె (పులిచెర్ల మండలం) పంచాయతీలున్నాయి.

పిచ్చికుక్క వీరంగం

● ఎనిమిది మందికి గాయాలు

సోమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పెద్దఉప్పరపల్లెలో పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. ఎనిమిది మందిని కరిచి గాయపరిచింది. ఈ గ్రామంలో కుక్కలు తరచూ జనం వెంటపడి భయభ్రాంతులకు గురిచేయడం పరిపాటిగా మారింది. ఈనేపథ్యంలో ఆదివారం రాత్రి పిచ్చికుక్క విజృంభించింది. స్థానికులు చరణ్ తేజ్, భారతమ్మ, రాజమ్మ, చాను, లక్ష్మయ్య, రవి, వి.చరణ్, ఎస్. లాలూసాహెబ్‌లపై దాడి చేసి కరిచింది. గాయాలపాలైన వీరు పెద్ద ఉప్పరపల్లె పీహెచ్‌సీలో చికిత్స పొందారు.

జడ్పీలో కారుణ్య నియామకాలు

చిత్తూరు రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ (జడ్పీ)లో కారుణ్య నియామకం కింద ఏడుగురికి జూనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగావకాశం కల్పించినట్లు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో వారికి నియామకపత్రాలు అందజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వీరికి పోస్టింగులు ఇచ్చినట్లు వివరించారు. సీఈవో రవికుమార్ నాయుడు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కౌన్సెలింగ్



పదోన్నతులు నిర్వహిస్తున్న జడ్పీ సీఈవో, డీపీవో తదితరులు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న పంచాయతీ కార్యదర్శుల కల నెరవేరింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 108 గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి స్థానిక జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్‌రావు నేతృత్వంలో సోమవారం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లకు గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత కలిగిన 83 మందిని కౌన్సెలింగ్‌కు హాజరుకావాలంటూ డీపీవో కార్యాలయం నోటీసులు పంపింది. వీరిలో 77 మంది మాత్రమే హాజరయ్యారు. దాదాపు మూడు గంటల పాటు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగింది.

2.5 కిలోల గంజాయి స్వాధీనం: ఇద్దరి అరెస్టు



నిందితుల వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

నగరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలో 2.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. సీఐ విక్రమ్ తెలిపిన వివరాల మేరకు.. తిరుత్తణి తాలుకా మురకంబట్టుకు చెందిన అబ్బాస్ (39) కొన్నేళ్లుగా నగరి మండలం వీకేఆర్‌పురంలో నివాసం ఉంటున్నాడు. ఇదే మండలంలోని ఓజీకుప్పంకు చెందిన మోహన్(30)తో కలిసి గంజాయి తరలిస్తుండగా వీకేఆర్‌పురం వద్ద సోమవారం పోలీసులు పట్టుకున్నారు. వారి వద్దనుంచి 2.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు. దాడుల్లో డీటీ ధనంజయులు, పోలీసులు ఇంద్రకుమార్, గోపి, గజేంద్ర, రమేష్, పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ 'కానిస్టేబుళ్ల' అసోసియేషన్ కార్యవర్గం



విజయ శేఖర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

చిత్తూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏఈఎస్ కృష్ణ కిషోర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. ఆదివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ఎన్నికలు జరిగాయి. జిల్లా అధ్యక్షుడిగా ఎస్.రామచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా ఆర్.హరిప్రసాద్, జయశంకర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.ప్రతాప్, జనరల్ సెక్రటరీగా కె.వేణుగోపాల్, ట్రెజరర్‌గా పి.అయ్యప్పరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.భారతి రాజా, జాయింట్ సెక్రటరీలుగా ఎ.సురేంద్ర బాబు, ఎస్.శ్రావణి, ప్రెస్ సెక్రటరీలుగా ఎస్.రమేష్, ఆర్.నాగరాజ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కె.విశాలాక్షి, జె.గాయత్రి, జి.బోసు కుమార్, బి.విజయ్ తదితరులు ఎంపికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు సోమవారం డీసీ విజయశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.

'పీజీఆర్ఎస్'కు వినతుల వెల్లువ

● సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్‌కు తరలివచ్చిన బాధితులు
● అధికారులకు అందిన అర్జీలు 299

చిత్తూరు అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. తమ సమస్యలు పరిష్కరించాలంటూ బాధితులు కలెక్టరేట్‌కు బాధితులు తరలి వచ్చారు. అర్జీలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు స్వీకరించారు. మొత్తం 299 అర్జీలు అందాయి. వీటిల్లో రెవెన్యూ శాఖకు 247, డీఆర్‌డీఏకు 24, పోలీసులకు 12, పంచాయతీరాజ్‌కు 4, విద్యాశాఖకు 3, డీసీసీబీ, మెప్మా, సివిల్ సప్లయీస్, చిత్తూరు మున్సిపల్ కమిషనర్, విద్యుత్, తదితర శాఖలకు 9 అర్జీల చొప్పున ఉన్నాయి.

ఇళ్ల స్థలాలివ్వండి



జీడీ నెల్లూరు మండలం వీరకనెల్లూరు పంచాయతీవాసులు

ఇళ్ల స్థలాలిచ్చి ఆదుకోవాలని జీడీనెల్లూరు మండలం వీరకనెల్లూరు పంచాయతీవాసులు కోరారు. సుమారు 75 కుటుంబాల వారు అద్దె ఇళ్లల్లో, ఉమ్మడి కుటుంబాల్లోనే ఉంటున్నారన్నారు. సర్వే నెంబరు 16, 16-6లో చిత్తూరు- బాలగంగనపల్లె రోడ్డును ఆనుకుని సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఇందులో అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.



పెనుమూరు మండలం పులికల్లు దళితులు

సాగు చేసుకుంటున్న భూమిలోకి రానీయడం లేదు

సర్వేనెంబరు 1196, 1197లో సుమారు 44 ఎకరాల భూమిని 66 కుటుంబాలు తాతలకాలం నుంచి సాగు చేసుకుంటున్నామని పెనుమూరు మండలం పులికల్లు దళితులు తెలిపారు. ఈ భూముల్లోకి తమను రానీయకుండా ప్రభాకరన్, హరి అనేవారు అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులకు లంచాలిచ్చి తప్పుడు రికార్డులు సృష్టించారని ఆరోపించారు. విచారించి, న్యాయం చేయాలని కోరారు.

ఆక్రమణకు గురైన యువజన సంఘం భవనం

తమ గ్రామంలో ఏడు సెంట్ల ప్రభుత్వ భూమిలో బోరు, గాంధీ హరిజన యువజన సంఘం కోసం ఒక చిన్న భవనం నిర్మించుకున్నామని జీడీ నెల్లూరు మండలం రామానాయుడుపల్లెవాసులు తెలిపారు. ఈ భవనంలోనే వయోజన విద్యా కార్యక్రమాలు, గౌరీపూజ, గంగజాతరను నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల ఓ వ్యక్తి ఈ భవనాన్ని ఆక్రమించుకున్నాడని ఫిర్యాదు చేశారు. విచారించాలని కోరారు.

వేతనాలు చాలడం లేదు

ఎన్టీఆర్ వైద్యసేవ కింద 17 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఇచ్చే వేతనాలు చాలడం లేదని ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వ పరిధిలోకి తీసుకోవాలని కోరారు. అలాగే పనిచేస్తూ మృతి చెందిన వారి కుటుంబీకులకు రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు, అంతర్గత ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న వైద్య మిత్రలు



బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, అర్జీలను పరిశీలిస్తున్న జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్

మరికొన్ని అర్జీలిలా..

తమకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లె దళితవాడవాసులు కోరారు. గతంలో ఉన్న శ్మశానవాటికను అగ్రకులస్తులు ఆక్రమించుకున్నారని ఇదేమండలంలోని యనమలమంద పంచాయతీ శ్రీనివాసపురం ఎస్టీలు ఆవేదన వ్యక్తం చేశారు. విచారించాలని కోరారు.

● తన భూమిని ఆక్రమించుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పూతలపట్టు మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు ఫిర్యాదు చేశారు. గ్రామకంఠంలో ఇల్లు కట్టుకున్నానని, ఈ స్థలానికి సంబంధించి 1996లో డాక్యుమెంట్లు వచ్చాయన్నారు. ఇంటి పక్క ఉన్న భూ యజమాని ఇంటితోపాటు మరికొంత స్థలాన్ని ఆక్రమించుకున్నాడని, అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నాడని వాపోయారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

పెద్ద వంక దిశ మార్పుపై విచారణ

● జడ్పీ చైర్మన్ ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్
● ఎక్స్‌ప్రెస్ వే పనులను అడ్డుకున్న రైతులు

వి.కోట/చిత్తూరు రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వి. కోట మండలం నక్కనపల్లె రహదారిలో రామాపురం పెద్దవంక వద్ద జరుగుతున్న నిర్మాణంపై క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నిర్మాణం వల్ల రైతులకు నష్టం జరుగుతుందని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చేసిన అభ్యర్థనపై కలెక్టర్ ఈమేరకు స్పందించారు. సోమవారం స్థానిక రైతులతో కలసి కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో సుమిత్‌కుమార్‌ను జడ్పీ చైర్మన్ కలిసి ఈ నిర్మాణం వల్ల జరిగే ఇబ్బందులను వివరించారు. ఎక్స్‌ప్రెస్ వే పనుల్లో భాగంగా వంకవద్ద నిర్మించాల్సిన బ్రిడ్జిని అనవసరమైన చోట నిర్మిస్తున్నారన్నారు. వంక వద్ద దిశను మార్చుతూ ఏరుకు అడ్డుగా పనులు చేపడితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. వర్షాకాలంలో వరద వంక ద్వారా ప్రవహిస్తే కింద వున్న భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అంతకుముందు స్థానిక రైతులు ఈ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. తమ జడ్పీటీసీ కూడా అయిన జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దృష్టికి తీసుకువెళ్లారు.ఆయన వెంటనే పనులు ఆపేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ డీఈ, ఏఈలు వి.కొత్తూరు వద్ద ఎక్స్‌ప్రెస్‌వే పనులను పరిశీలించి, రైతుల అభ్యంతరాలను తెలుసుకున్నారు. కలెక్టర్‌కు నివేదిక పంపుతామని వారు తెలిపారు.



రామాపురం పెద్ద వంకకు అడ్డుగా జరుగుతున్న నిర్మాణాలు (ఇన్‌సెట్‌లో) కలెక్టర్‌కు వంక దిశ గురించి వివరిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పోలీసు కార్యాలయానికి 45 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 45 అర్జీలు అందాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. వీటి ల్లో.. భూ తగాదాలపై 13, కుటుంబ తగాదాలపై 12, డబ్బు తగాదాలపై 5, వేధింపులపై 4, ఇంటి తగాదాలపై 4, చీటింగ్‌పై 2, ఆస్తి తగాదాలపై 2, దారి సమస్యపై ఒకటి, భర్త వేధింపులపై ఓ అర్జీ చొప్పున ఉన్నాయి.

రామకుప్పం ఎంపీపీ ఎన్నికపై ఉత్కంఠ

● వైసీపీ అంతర్గత రాజకీయాలతో ఐదుసార్లు వాయిదా
● టీడీపీలోకి వైసీపీ ఎంపీటీసీల చేరికతో మారిన సమీకరణాలు

రామకుప్పం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రామకుప్పం ఎంపీపీ, రెండో వైస్ ఎంపీపీ పదవులకు గురువారం జరగనున్న ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. వైసీపీ అంతర్గత రాజకీయాలతో ఈ ఎన్నికలు ఐదు సార్లు వాయిదా పడింది. ఇటీవల వైసీపీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీలు టీడీపీలో చేరడంతో ఈసారి ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. 2021 డిసెంబరు 12న ఎంపీపీ శాంతకుమారి మృతి చెందారు. అప్పటి నుంచి వైస్‌ఎంపీపీ సుబ్రహ్మణ్యం ఎంపీపీగా పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రెండో వైస్ ఎంపీపీ విషయంలో పలువురు పోటీ పడటంతో అప్పట్లో ఎన్నిక జరగలేదు. తాజాగా ఈ రెండు పదవులకూ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

సర్వత్రా ఆసక్తి

ఈ ఎన్నికలను టీడీపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మండలంలో 15 మంది ఎంపీటీసీలున్నారు. గతేడాది సార్వత్రిక ఎన్నికల తర్వాత వైసీపీకి చెందిన ఏడుగురు ఎంపీటీసీలు టీడీపీలో చేరారు. ఈసారి ఎన్నికలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా పడే అవకాశం లేదని టీడీపీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. పార్టీలో చేరిన వైసీపీ ఎంపీటీసీల్లో ఒకరిని ఎంపీపీగా, మరొకరిని రెండో వైస్‌ఎంపీపీగా ఎన్నుకునేందుకు పార్టీ పెద్దలు కసరత్తు ప్రారంభినట్టు సమాచారం. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో, టీడీపీ సానుభూతి పరుడు, అయ్యప్పగానిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం వైసీపీలో చేరాడు. రామకుప్పం-2 ఎంపీటీసీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. తర్వాత ఆయన ఒకటో వైస్‌ఎంపీపీగా ఎన్నికయ్యారు. రెండో ఎంపీపీ పదవికి పోటీ తీవ్రంగా ఉండటంతో ఇప్పటి వరకు ఎన్నిక జరగలేదు. ఒకటో ఎంపీపీ పదవిలో సుబ్రహ్మణ్యాన్ని కొనసాగిస్తారా, లేక ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ఆ పదవికి కూడా ఉప ఎన్నికకు వెళతారా అన్నది తేలాల్సి ఉంది. కాగా ఈ ఎన్నికల కోసం గురువారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆర్డీవో శ్రీనివాసులరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి తెలిపారు.

క్రెడిట్ కార్డుతో రూ.1.12 లక్షలు కొట్టేశారు

● 1930 ఫిర్యాదుతో సైబర్ నేరగాళ్ల నుంచి నగదు రికవరీ చేసిన పోలీసులు



వివరాలు తెలియజేస్తున్న ఎస్ఐ ఈశ్వర్

యాదమరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి క్రెడిట్ కార్డు ఉపయోగించి రూ.1,12,900 కొట్టేశారు. బాధితుడు 1930 నెంబరుకు ఫిర్యాదు చేయడంతో సైబర్ నేరగాళ్ల వద్దనుంచి ఆ మొత్తాన్ని పోలీసులు రికవరీ చేశారు. ఎస్ఐ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలంలోని రసూల్ నగర్‌కు చెందిన మహ్మద్ హఫీజ్ చిత్తూరులో మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తమిళనాడు రాష్ట్రం గుడియాత్తం పట్టణంలో బంగారు నగలను తన క్రెడిట్ కార్డు ద్వారా రూ.40వేలకు కొన్నాడు. అదేరోజు రాత్రి 10.30 గంటల సమయంలో రూ.1,12,900 లకు అమెజాన్ యాప్‌లో కొన్ని వస్తువులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసినట్లు అతడి ఫోన్‌కు సమాచారం వచ్చింది. ఖంగుతిన్న బాధితుడు వెంటనే యాదమరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ నేరం కావడంతో ఎస్ఐ సూచనలతో 1930 నెంబరుకు అదే రోజున ఫిర్యాదు చేశాడు. స్పందించిన సైబర్ సెల్ టీమ్ సభ్యులు బాధితుడు పోగొట్టుకున్న మొత్తాన్ని రికవరీ చేశారు. ఎస్పీ మణికంఠ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైబర్ సెల్ టీమ్‌కు, యాదమరి పోలీసులకు బాధితుడు సోమవారం కృతజ్ఞతలు తెలిపాడు.

నేడు ప్రభుత్వ ఇఫ్తార్ విందు

చిత్తూరు అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా అగ్నిమాపక కార్యాలయం సమీపంలో ఉన్న షాదీమహల్‌లో ఇఫ్తార్ విందు కార్యక్రమం మంగళవారం సాయంత్రం 5.30గంటలకు జరగనుంది. ఈ మేరకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి చిన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ సుమిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ విందుకు ముస్లింలు, మత పెద్దలు హాజరు కావాలని కోరారు.

రేపట్నుంచే భువనేశ్వరి కుప్పం పర్యటన



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల, మనోహర్ తదితరులు

కుప్పం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పార్టీ శ్రేణులను కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆయన ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, ముఖ్య నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భువనేశ్వరి పర్యటన షెడ్యూల్ విడుదల చేశారు. వివరాలిలా..

●ఈనెల 26వ తేదీ ఉదయం 12.40 గంటలకు గుడుపల్లె మండలం అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌ను సందర్శించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులలో ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు గుడిచెంబగిరిలో గ్రామీణ మహిళలతో సమావేశమవుతారు. సాయంత్రం 6-7.30 గంటల మధ్య పీఈఎస్ గెస్ట్ హౌస్‌లో నియోజకవర్గ ముఖ్య టీడీపీ నాయకులతో సమావేశమవుతారు.

●27వ తేదీ ఉదయం 9 గంటలకు గెస్ట్‌హౌస్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. 9.40 గంటలకు కుప్పంలోని ఇండియన్ బ్యాంకు ప్రారంభోత్సవానికి హాజరవుతారు. 10.55 గంటలకు మోడల్ కాలనీ మహిళలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కృష్ణదాసనపల్లెలో మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. 3.15 గంటలకు పంచాయతీ మహిళలతో సమావేశమవుతారు. తర్వాత పీఈఎస్ గెస్ట్ హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో సమావేశంలో పాల్గొంటారు.

●28వ తేదీ ఉదయం 10.30 గంటలకు శాంతిపురం మండలం నడింపల్లెలో మహిళలతో ముఖాముఖిలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.15 గంటలకు నక్కనపల్లెలో మల్బరీ తోటలు, సెరికల్చర్ షెడ్లు పరిశీలిస్తారు. 2 గంటలకు రామకుప్పం మండలం రాజుపేటలో మహిళలతో, 3.30 గంటలకు కొంగనపల్లె మహిళలతో సమావేశమవుతారు. సాయంత్రం 5.15 గంటలకు శాంతిపురం మండలం కడపల్లె వద్ద సొంత ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తారు.

● 29వ తేదీ ఉదయం 9 గంటలకు కుప్పంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొంటారు. 9.30 గంటలకు షాహీ గార్మెంట్స్‌లో మహిళా కార్మికులతో సమావేశమవుతారు. 10.30 గంటలకు టీడీపీ కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ ట్రస్టు తరఫున లబ్ధిదారులకు తోపుడు బళ్లు, కుట్టు మిషన్లు అందజేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు భువనేశ్వరి కుప్పంనుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్తారు. విలేకరుల సమావేశంలో టీడీపీ మున్సిపల్, కుప్పం రూరల్ మండలం, గుడుపల్లె, శాంతిపురం మండలాల అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, బాబునాయుడు, విశ్వనాథనాయుడు, గుడుపల్లె మాజీ ఎంపీపీ చంద్రశేఖర్, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పంటలపై ఆగని ఒంటరి ఏనుగు దాడులు



ఒంటరి ఏనుగు ధ్వంసం చేసిన వరి పంట



డ్రోన్ కెమెరాతో ఏనుగు జాడను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్‌వో థామస్ సుకుమార్

కల్లూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లి (గెండేవారిపల్లి) సమీపంలో ఆదివారం రాత్రి పంటలపై ఒంటరి ఏనుగు దాడులు కొనసాగించింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన ఒంటరి ఏనుగు కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపానికి చేరుకుంది. రైతులు కుమార్‌రెడ్డి, ఉమాపతిపిళ్లైకు చెందిన వరి పంటలను ధ్వంసం చేసింది. అనంతరం రైతుల మామిడితోటల్లో కొమ్మలను విరుకుంటూ అడవిలోకి చేరుకుంది. ఎఫ్ఆర్‌వో థామస్ సుకుమార్, ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ సిబ్బందితో పాళెం పంచాయతీ జూపల్లి సమీపంలో తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు వద్దకు చేరుకున్నారు. ఒంటరి ఏనుగు జాడను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాతో గాలింపు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏనుగు జాడను డ్రోన్ కెమెరాతో గుర్తించామన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
తిరుపతి - 9703618708, 9030367786
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED
(CC TV) CC కెమెరా టెక్నీషియన్ కావలెను. 2 సంవత్సరాలు అనుభవం కలిగివుండాలి. అర్హత Min. 10th చదివి వుండాలి. Salary 10,000 to 18,000. Cont. : 7661999969
AJT - 200778

CHANGE OF NAME
I, DANDU RIZWAAN (old Name), S/o DANDU MUSTAFA, R/o 193, Bhagampalli kaspa, T Sundupalli Annamayya DT AP., I Have Changed My Name & Sur Name as SHAIK RIZWAN (New Name)
AJT - 215549

WANTED
తిరుపతి, ప్రముఖ ఆఫీస్ నందు పనిచేయుటకు పురుషులు, స్త్రీలు కావలెను. 40 సం. వయసులోపు ఎయిర్ బైపాస్ రోడ్డు, ఈజీ బై బట్టల షో రూమ్ ఎదురుగా. సంప్ర. : 90639 11909, 97031 44489
AJT - 200777

TOLET
తిరుపతి ఆటోనగర్ నందు ప్లాట్ నెంబర్ 6, వినాయకుడి గుడి సమీపాన 6000 చదరపు అడుగుల షోరూముల కొరకు మరియు గోడౌన్లకు అనుకూలంగా ఉంటుంది. వివరాలకు సంప్రదించండి. 89196 37861, 73388 44484
AJT - 200779

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 226998

స్థలం అమ్మకము
➡ Tirupati toll gate near off NH 205, 2.5 Acres High Rise Land Suitable for School, College any Commercial Activities. Cont: 9445253860.
AJG-210519

పాఠకులకు ముఖ్యగమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

పలమనేరు
కుప్పం/పుంగనూరు

క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరానికి స్పందన


వైద్యులతో మహతి ఫౌండేషన్ నిర్వాహకులు

భైరెడ్డిపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో బెంగళూరు వైదేహి ఆస్పత్రి వైద్యులు సోమవారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 84మందికి పరీక్షలు జరిపి 15మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. గ్రామీణప్రాంత ప్రజలకు సౌకర్యకరంగా ఇక్కడ ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేసిన మహతి ఫౌండేషన్ సేవలను పలువురు అభినందించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విజయచందర్, వైద్యనిపుణులు డాక్టర్ కిరణ్‌కుమార్, మహేష్, ప్రత్యూష, ముక్తా, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు శాంతమ్మ, బుజ్జి, శ్రీనివాసులు, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మహా భారత ఉత్సవాల ప్రారంభం

కల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కల్లూరు సచివాలయం-3 సమీపంలో ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయ ప్రాంగణంలో సోమవారం ధ్వజారోహణంతో మహభారతం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకుల మంత్రోచ్ఛరణల నడుమ ఈ వేడుక నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి సీతాలక్ష్మి వ్యాస జననం హరికథను వినిపించారు. తిరుపతికి చెందిన వేంకటేశ్వర నాట్య కళామండలి సభ్యులు రాత్రి నాటకాన్ని ప్రదర్శించారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి మఠం వార్షికోత్సవం

పలమనేరు, మార్చి24 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాఘవేంద్రస్వామి మఠం వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించి స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. మఠం అధ్యక్షుడు మోహనకృష్ణ శ్రీరాఘవేంద్ర సేవాసమితి నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. మఠం లోపల, వెలుపల నిత్యం స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న దంపతులకు వస్త్రాలను, కానుకలను అందజేసి సన్మానించారు. భక్తులకు పంచాంగ పుస్తకాలను అందజేశారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా


సభ్యత్వ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, ప్రేమ్‌కుమార్

కుప్పం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తల భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌లు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ రూరల్ మండల సమావేశం జరిగింది. సభ్యత్వ కార్డులను పంచాయతీల పార్టీ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యత్వ కార్డులను కార్యకర్తల ఇళ్లకు వెళ్లి అందజేయాలని సూచించారు. భువనేశ్వరి కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని, కోరారు. సీఎం వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఏవీ.రవి, రామచంద్ర, మహేంద్ర, జేకే.సంతోశ్, రవి, ధనశేఖర్, క్రిష్ణయ్య, రాజేంద్ర, వసంతమ్మ, మణి, పార్థసారధి, సుబ్బు, మురళి, యూనిట్ ఇన్‌చార్జిలు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, బూత్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

భైరెడ్డిపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటిసమస్య తలెత్తకుండా ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీవో రాజేంద్రబాలాజీ సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధశాఖల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి కారణంగా గ్రామాల్లో తాగునీటిసమస్య ఏర్పడకుండా తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. గృహనిర్మాణ శాఖ ద్వారా జరుగుతున్న నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లోకనాథం, హౌసింగ్ ఏఈ అశోక్, ఎంఈవో సురేష్‌బాబు పాల్గొన్నారు.

దయాగుణమే నర్సింగ్ వృత్తికి అలంకారం

కుప్పం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దయాగుణం నర్సింగ్ వృత్తికి అలంకారంగా భాసిల్లుతుందని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ అన్నారు. బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం నర్సింగ్ కళాశాల వార్షికోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బీసీఎన్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు క్రమశిక్షణతో సేవలు అందించాలన్నారు. డాక్టర్ బాబు రంగరాన్ మాట్లాడుతూ విద్యార్థులు దయాగుగుణంతో మెలగాలని సూచించారు. వైస్ చైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, కుప్పం డిగ్రీ కళాశాల చైర్‌పర్సన్ ఎస్.శాంతానాగరాజ్, సీఈవో సాగర్‌రాజ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విమల, కేడీసీ ప్రిన్సిపాల్ సుధారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

వి.కోట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ పనిచేస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రంగనాథ్ అన్నారు. సోమవారం పట్టణంలోని నారాయణనగర్‌లో కార్యకర్తలకు పార్టీ అందజేసిన సభ్యత్వ కార్డులను సభ్యులకు పంపిణీ చేశారు. పార్టీ ఆవిర్భావం నుండి టీడీపీకి కంచుకోటగా ఉన్న వి.కోట మండల పరిధిలో 14 వేలకు పైగా సభ్యత్వాలను నమోదు చేసి నియోజకవర్గంలోనే ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మెన్ రామచంద్రనాయుడు, ధీరజ్, శబరీస్ తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, తిరుపతి బ్రాంచ్ మేనేజర్ వారు ఇచ్చిన ఆదేశాల ప్రకారము ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి రొంపిచెర్ల మండలం రొంపిచెర్ల గ్రామం గాంధ్ర వీధి ఇం.నెం.1-270ఇంటిలో ఉండు లేట్ నూర్ సాహెబ్ కుమారుడు షేక్ మస్తాన్ గారికి చెందిన ఆస్తిని రిజిస్టరు తనఖా చేయించుకుని సదరు షేక్ మస్తాన్ గారికి ఋణము ఇవ్వుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారములకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి ఖర్చులు, దార్లీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినముల లోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

షెడ్యూలు : చిత్తూరు డిస్ట్రిక్ట్, చిన్నగొట్టిగల్లు సబ్ డిజి చేరిన రొంపిచెర్ల మండలం, రొంపిచెర్ల గ్రామం, పంచాయతీ- రొంపిచెర్ల గ్రామం మజరా 1వ వార్డు గాంధ్ర వీధి డోర్ నెం. 1-63 నెంబరు ఇంటికి ఉత్తర దిశలో సర్వే నెం. 1051-1A, 1051-1B భూలో గల 1వ అయిటము ఫ్లాట్ విడువు జాగాకు హద్దులు & కొలతలు వివరం: తిమిరి వెంకటరమణ, బాదర్‌బాషా, పోకరి అలి వీధి జాగాలు, దక్షిణం: షేక్ అఫ్రోజా బీ గారి జాగా, తూర్పు: రొంపిచెర్ల నుండి గానుగచింతకు పరకు పోవు సిమెంట్ రోడ్డు, పడమర : షేక్ అఫ్రోజా బీ గారి జాగా, పై నాలుగు హద్దులు మధ్య గల ఫ్లాటు విడువు జాగా పూరా మాత్రం. పై హద్దులు మధ్యగల విడువు జాగాకు కొలతలు: తూర్పు: పడమర: ఉత్తర దిశలో 463/4 అడుగులు లేక 14.25 మీటర్లు, తూర్పు : పడమర: దక్షిణ దిశలో 773/4 అడుగులు లేక 23.71 మీటర్లు, ఉత్తరం: దక్షిణం: తూర్పు దిశలో ఉత్తర దిశలో కొలత లేదు. ఉత్తరం: దక్షిణం: పడమర దిశలో44 అడుగులు లేక 13.42మీటర్లు, ఇందుకు 1369 1/2 చదరపు అడుగులు తూర్పు 152.16 చదరపు గుజముల ఫ్లాటు విడువు జాగా మాత్రం.

చిత్తూరు డిస్ట్రిక్ట్, చిన్నగొట్టిగల్లు సబ్ డిజి చేరిన రొంపిచెర్ల మండలం, రొంపిచెర్ల గ్రామం, పంచాయతీ- రొంపిచెర్ల గ్రామం మజరా 1వ వార్డు గాంధ్ర వీధి డోర్ నెం. 1-63 నెంబరు ఇంటికి ఉత్తర దిశలో సర్వే నెం. 1051-1A, 1051-1B భూలో గల 2వ అయిటము ఫ్లాట్ విడువు జాగాకు హద్దులు & కొలతల వివరం: ఉత్తరం: భూమిరెడ్డి చంద్రశేఖరరెడ్డి గారి గోడౌన్, దక్షిణం: 3వ అయిటము జాగా, తూర్పు: షేక్ అఫ్రోజాబీ గారి జాగా, పడమర: రామకొండారెడ్డి గారి జాగా. పై నాలుగు హద్దుల మధ్య గల ఫ్లాటు విడువు జాగా పూరా మాత్రం. పై హద్దులు మధ్యగల విడువు జాగాకు కొలతలు: తూర్పు: పడమర: ఉత్తర దిశల కొలతలేదు, తూర్పు: పడమర దక్షిణ దిశలో 26 అడుగులు లేక 7.9301 మీటర్లు, ఉత్తరం: దక్షిణం: తూర్పు దిశలో 60 అడుగులు లేక 18.30 మీటర్లు, ఉత్తరం: దక్షిణం: పడమర దిశలో 50 అడుగులు లేక 15.25 మీటర్లు, ఇందుకు 715 చదరపు అడుగులు తూర్పు 79.44 చదరపు గుజముల ఫ్లాటు విడువు జాగా మాత్రం.

చిత్తూరు డిస్ట్రిక్ట్, చిన్నగొట్టిగల్లు సబ్ డిజి చేరిన రొంపిచెర్ల మండలం, రొంపిచెర్ల గ్రామం, పంచాయతీ- రొంపిచెర్ల గ్రామం మజరా 1వ వార్డు గాంధ్ర వీధి డోర్ నెం. 1-63 నెంబరు ఇంటికి ఉత్తర దిశలో సర్వే నెం. 1051-1A, 1051-1B భూలో గల 3వ అయిటము ఫ్లాట్ విడువు జాగాకు హద్దులు & కొలతల వివరం: ఉత్తరం: 3వ అయిటము జాగా, దక్షిణం: షేక్ గఫూర్ సాహెబ్ గారి జాగా, తూర్పు: మంగళంపేట షేక్ మహబూబ్ బాషా గారి జాగా, పడమర: రామకొండారెడ్డి గారి జాగా, పై నాలుగు హద్దులు మధ్య గల ఫ్లాటు విడువు జాగా పూరా మాత్రం. పై హద్దులు మధ్యగల విడువు జాగాకు కొలతలు: తూర్పు :పడమర: ఉత్తర దిశలో 26 అడుగులు లేక 7.9301 మీటర్లు, తూర్పు: పడమర: దక్షిణ దిశలో 15 అడుగులు లేక 4.575 మీటర్లు, ఉత్తరం: దక్షిణం: తూర్పు దిశలో 17 అడుగులు లేక 5.185 మీటర్లు, ఉత్తరం: దక్షిణం: పడమర దిశలో 13 అడుగులు లేక 3.965 మీటర్లు, ఇందుకు 307 1/2 చదరపు అడుగులు తూర్పు 34.15 చదరపు గుజముల ఫ్లాటు విడువు జాగా మాత్రం.

మూడు అయిటముల జాగాలు వెరశి 266 చదరపు గుజములు జాగాలు పూరా మాత్రం.

ఇ.వి.సుబ్బయ్య, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్, డో.నెం.8-114/2 రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్ : 94402 02564

వైభవంగా సదుం గంగమ్మ జాతర

సదుం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక నడివీధి గంగమ్మ జాతర అమ్మవారి నిమజ్జనంతో వైభవంగా ముగిసింది. ఆదివారం అర్ధరాత్రి స్థానిక శాలివాహన వారి ఇంటి వద్ద శుద్ధ మట్టితో అమ్మవారి ప్రతిమను తీర్చిదిద్ది ఆలయంలో ప్రతిష్ఠించారు. అక్కడ పూజలు నిర్వహించాక ఊరేగింపుగా తీసుకువచ్చి గ్రామ నడిబొడ్డున చలువ పందిరిలో కొలువు దీర్చారు. గ్రామ నలుదిక్కుల నుంచి మేళతాళాలతో భక్తులు దీపాలను తీసుకెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. మతాలకు అతీతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

2న దుకాణాలకు వేలం

పుంగనూరు రూరల్, మార్చి24 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు. రొంపిచెర్ల ఆర్టీసీ బస్టాండ్ పరిధిలోని దుకాణాలకు ఏప్రిల్ 2వ తేదీన నబహిరంగ వేలం వేయనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు రామకుప్పం పంచాయతీలో వేలం పాట

రామకుప్పం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మేజర్ పంచాయతీలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ మురళీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకట రవిప్రసాద్, సర్పంచు మురళీకృష్ణలు తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనే వారు 11గంటలు లోపు డిపాజిట్, సాల్వెన్సీలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వారపు సంత గుత్తకు సాల్వెన్సీ ఉన్నవారు రూ.1.50లక్షలు, సాల్వెన్సీ లేని వారు రూ.2లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.50వేలు, ప్రేవేటు బస్టాండుకు రూ.1లక్ష, షాపింగ్ గదులకు ఒక్కోదానికి రూ.30వేలు, చికెన్‌షాపులకు ఒక్కోదానికి రూ.12వేలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

నేడు రక్తదాన శిబిరం

పలమనేరు, మార్చి24 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమతారాణి తెలిపారు. యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈరక్తం ఆపదలో ఉన్న వారి ప్రాణం కాపాడేందుకు ఉపయోగపడుతుందని ఆమె పేర్కొన్నారు.

పెద్దపంజాణి ఎస్ఐగా ధనుంజయరెడ్డి

పెద్దపంజాణి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఐగా ధనుంజయరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ బదిలీ కావడంతో చిత్తూరులో వీఆర్‌లో ఉన్న ధనుంజయరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు ఎలాంటి సిఫార్సులు లేకుండా రావాలన్నారు.

రూరల్ ఎస్ఐగా వెంకటరమణ బాధ్యతలు

పుంగనూరు రూరల్, మార్చి24(ఆంధ్రజ్యోతి): రూరల్ ఎస్ఐగా వెంకటరమణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. వీఆర్‌లో ఉన్న ఈయనకు జిల్లా ఎస్పీ మణికంఠ ఉత్తర్వుల మేరకు రూరల్‌కు బదిలీ చేశారు.

11 మంది విద్యార్థుల గైర్హాజరు

పలమనేరు, మార్చి24 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు 11 మంది గైర్హాజరయ్యారు. ఏడు పరీక్షా కేంద్రాల్లో 1377 మంది పరీక్షలు రాయాల్సి వుండగా 1366 మంది హాజరయ్యారని రాశారని మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, బాలసుందరంలు తెలిపారు.

మాజీ సీజేఐ జస్టిస్ రమణకు సత్కారం


జస్టిస్ రమణను సన్మానిస్తున్న శ్రీకాంత్ తదితరులు

కుప్పం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పీఈఎస్ వైద్య కళాశాల పట్టభద్రుల దినోత్సవంలో పాల్గొనడానికి సోమవారం కుప్పం వచ్చిన మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ.రమణను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబులు కలిశారు. ఆయనను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్‌లు ఉన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

పుంగనూరు రూరల్, మార్చి24(ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా ముస్లింలకు జనసేన నేత వేణుగోపాల్‌రెడ్డి తోఫాను పంపిణీ చేశారు. సోమవారం చదళ్లలో దాదాపు వెయ్యి కుటుంబాలకు నిత్యవసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి, విరూపాక్షి, చైతన్యరాయల్, హరినాయక్, బాలాజీనాయక్, సలీం, నజీర్, కాలేషా, సద్దు, ఆర్షద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్మానంపై సంబరాలు


కూటమి నాయకులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

పుంగనూరు రూరల్, మార్చి24(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ప్రభుత్వం ఏకగ్రీవ తీర్మానం చేయడంతో కూటమి నాయకులతో కలసి ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కూటమి నాయకులు మాధవరెడ్డి, గంగాధర్, రాఘవ, విరూపాక్షి, చైతన్య రాయల్, జగదీశ్వర్, నరసింహులు పెద్దమఠం బాబు, పాముల హరి, ఎమ్మార్పీఎస్ నాయకులు నరిసింహులు, నాగభూషణం, ప్రభాకర్, నారాయణ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

సోమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపు సంతలో సోమవారం జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్లు వైద్య పరీక్షలు జరిపారు. 20 మందిని ఆపరేషన్‌కు ఎంపికచేశారు. శిబిరంలో పాల్గొన్నవారికి ఉచిత మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, భార్గవ్ చంద్ర, శీలం రామూర్తి, డాక్టర్ దాసరి నరసింహులు పాల్గొన్నారు.

జాతరకు ముస్తాబైన ఆలయం

పుంగనూరు రూరల్. మార్చి24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమీందార్ ప్యాలెస్ ఆవరణలోని సుగుటూరు గంగమ్మను ప్రతిష్ఠించే ఆలయం జాతరకు ముస్తాబు చేశారు. జమీందార్ల ప్యాలెస్ ఆవరణ, ఆలయం చుట్టుపక్కల శుభ్రం చేశారు. బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు.

వినతుల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి

సోమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోలు ప్రజల నుంచి అందిన వినతులు వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ బెన్నురాజ్ కోరారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డుదారులకు ఈకేవైసీ ఈనెల 31 లోపు తప్పని సరిగా చేయించాలన్నారు. రేషన్‌డీలర్లు, డీఎస్‌వో, తహసీల్దార్ లాగిన్‌లల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లోని మొబైల్ యాప్‌ల్లోని ఈ-పోస్ట్ పరికరాల ద్వారా అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

పదేపదే తిరుగుతున్నా పరిష్కారమేదీ?

భూ సమస్య బాధితుల ఆవేదన


ఫిర్యాదుదారు నుంచి అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో దాదాపు 20 మందికి పైగా రెవెన్యూ బాధితులు తమ గోడు వెల్లబోసుసుకున్నారు. ఆర్డీవో భవానికి అర్జీలు సమర్పించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూశాఖలో కొందరు ఉద్యోగులు చేస్తున్న పొరపాట్లు, తప్పులు కారణంగా భూవివాదాలు పరిష్కారం కావడంలేదు. ఫలితంతా పదేపదే బాధితులు అర్జీలతో కార్యాలయానికి వస్తున్నారు. మదనపల్లి డివిజన్ నుంచి విడిపోయాక ఇక్కడి డివిజన్ పరిధిలోని భూసమస్యలకు సంబంధించిన కీలక రికార్డులు నేటికీ చేరలేదు.


వెంకటరమణ

● వనమల దిన్నె గ్రామానికి చెందిన దళిత రైతు ఎస్. వెంకటరమణ తాను కొనుగోలు చేసిన భూమిలో కొంత భాగం అదేగ్రామానికి చెందిన వారు దౌర్జన్యంగా కంచెవేసుకొన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్పష్టంగా కొలిచి భూమిని తనకు అప్పగించాలని ఆరీవోకు అర్జీ అందజేశారు.


బి.నాగరాజు

● తన డీకేటి భూమిని సెటిల్ మెంట్ చేస్తామని చెప్పి గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ రికార్డుల్లోనే లేకుండా చేశారని బోడిరెడ్డిపల్లికి చెందిన బి. నాగరాజు వాపోయారు. పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నందున భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు.


చోళేశ్వరరావు

● తన తల్లి పేరిట ఉన్న భూమిని మరొకరి పేరుతో రెవెన్యూ రికార్డుల్లో మార్చిన బాధ్యుడిపై చర్యలు తీసుకోవాలని విశ్రాంత పోలీసు అధికారి చోళేశ్వరయ్య కోరారు. సదుం వద్ద 3.56 ఎకరాల స్థలం తనతల్లి జయమ్మ పేరుతో ఉండగా దాన్ని 2021లో అప్పటి తహసిల్దార్ మ్యూటేషన్ పెట్టారన్నారు. దీనిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి సమీప బంధువు వేణుగోపాలరెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించాడన్నారు. భూమిని స్వాధీనం చేయించాలని కోరారు.


నారాయణప్ప

● 50ఏళ్లుగా సాగుచేసుకొంటున్న భూమికి తన పేరున పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కూటాలవంక గ్రామానికి చెందిన నారాయణప్ప కోరారు. రెండేళ్ల క్రితం ఆర్డీవో పట్టా ఇవ్వాలని ఆదేశించినా ఎవరూ పట్టించుకోలేదన్నారు

క్షయ వ్యాధి నివారణ ర్యాలీలు


కల్లూరులో క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సోమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలని వైద్యాధికారులు డాక్టర్ నీలిమా, విజయలక్ష్మి, డాక్టర్ జయసింహ, డాక్టర్ బాలాజీలు కోరారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినం సందర్భంగా సోమవారం సోమల, పెద్దఉప్పరపల్లె, కందూరు పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు, పోషకాహారం కోసం పింఛన్లు పంపిణీ చేశారు. అమరనాథ్, గీత, హేమలత, రహీమా, చంద్రమ్మ, మునిలక్ష్మి, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో సోమవారం నిర్వహించిన ర్యాలీలో ప్రభుత్వ వైద్యాధికారులు జానకీరావు, సుజిత, సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు. టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు.

భైరెడ్డిపల్లె: తీర్థంలో వైద్యాధికారి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి సిబ్బంది అవగాహనార్యాలీ నిర్వహించారు. కాంతమ్మ పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జరిగిన అవగాహన ర్యాలీలో మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి మాట్లాడారు. డాక్టర్లు రజిత, జశ్వంత్, రామాంజులు, టీబీ.సూపర్‌వైజర్ సిద్దార్థ, ప్రవీన్, నర్సింగ్ సూపర్‌వైజర్ భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేపల్లె: డాక్టర్ పవన్‌కుమార్ నేతృత్వంలో వైద్యసిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. **రొంపిచెర్ల:** మండల కేంద్రంలో ప్రాథమిక వైద్యాధికారులు దినేష్‌కుమార్‌నాయక్, వినయ్‌లు ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞలు చేయించి ప్రజలకు అవగాహన కల్పించారు.

రామకుప్పం: విజలాపురంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి పూజిత అధ్వర్యంలో వైద్య సిబ్బంది క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. వైద్యాధికారి సాయిశ్రీ పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.13.75 లక్షల ఆదాయం

చౌడేపల్లె, మార్చి24(ఆంధ్రజ్యోతి): దిగువపల్లె పంచాయతీకి వేలం పాటల ద్వారా రూ.13.75లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవోఆర్డీ కృష్ణవేణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. బోయకొండ గంగమ్మ ఆలయం కొలువై ఉండటంతో వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వేలం పాటలు నిర్వహించామన్నారు. కోళ్ళ అంగళ్ళు నిర్వహించుకునే హక్కును రూ.12.05 లక్షలతో దక్కించుకున్నారన్నారు. ఐస్‌క్రీం అంగళ్ళు నిర్వహించుకునేందుకు రూ.1.70లక్షలతో దక్కించుకున్నారు. వేలంలో పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, సర్పంచ్ సోని, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: చల్లా


కార్యకర్తలతో మాట్లాడుతున్న చల్లా బాబు

రొంపిచెర్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంలో తాను ముందుంటానని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి చెప్పారు. సోమవారం ఆయనను సోమల, రొంపిచెర్ల మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు కలిసి సమస్యలు, అభివృద్ధి పనుల గూర్చి వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించారు. రొంపిచెర్ల మండలంలో తాగునీటి సమస్యలను కలెక్టరు దృష్టి తీసుకెళ్లి పరిష్కరిస్తానని సర్పంచ్ ఇబ్రహీంఖాన్, మండలనాయకులు మాజీ సర్పంచ్ రవికకుమార్‌నాయుడు, ఓబులేశ్వరరెడ్డిలకు చెప్పారు. ప్రభుత్వ పథకాలు పేదలందరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీ నాయకులు ఉయ్యాలరమణ, విశ్వనాథ, మణి, గణేష్, లక్ష్మయ్య, నాగరాజ పాల్గొన్నారు.

సుగుటూరు గంగమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

పుంగనూరు, మార్చి24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళ, బుధవారాల్లో జరిగే సుగుటూరు గంగమ్మ జాతర ప్రాంతాలను జిల్లా ఎస్పీ మణికంఠ సోమవారం రాత్రి పరిశీలించారు. గంగమ్మ ఊరేగే నగిరివీధి, సుబేదార్‌వీధి, కుమ్మరవీధులను ఆయన చూశారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆయన జమీందార్ కుటుంబ సభ్యులతో జాతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ ప్రభాకర్, సీఐలు రాంభూపాల్, ఉమామహేశ్వర్‌రావు, ఎస్ఐ లోకేశ్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

పలమనేరు, మార్చి24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని వార్డులవారీగా టీడీపీ సభ్యత్వ కార్డులను సోమవారం ఆ పార్టీ నాయకులు అందజేశారు. మున్సిపాలిటీలో 26 వార్డులకు ఇంచార్జిలతోపాటు యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జీలకు ఆయా బాధ్యతలు అప్పగించారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయంలో పట్టణ నాయకులు, కార్యకర్తలతో సందడి నెలకొంది. కార్యక్రమంలో సూపర్‌బజార్ అధ్యక్షుడ8 ఆర్బీబాలాజి, పట్టణ అధ్యక్షుడు ఆర్బీసీకుట్టి, ప్రధాన కార్యదర్శి గిరిబాబు, సుబ్రమణ్యం గౌడు, ఖాజాపీర్, కోటి, మదన్‌మోహన్, సురేష్, బాబాజాన్, మోహన్ పాల్గొన్నారు.

ఘనంగా ఫాంటసీ ఫియస్టా కార్నివాల్

కుప్పం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నిగూఢంగా ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఫాంటసీ ఫియస్టా నిర్వహించినట్లు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ బీఎం.దయానిధి తెలిపారు. కుప్పంలోని ఐడీపీఎస్‌లో సోమవారం ఫాంటసీ ఫియస్టా కార్నివాల్‌ను ఘనంగా నిర్వహించారు. రోబోటిక్ విద్య, ఇంటలెక్చువల్ ఇంటరాక్షన్, నెక్ట్స్ ఎడ్యుకేషన్ కరికులం ఎక్స్‌పో, 360 డిగ్రీస్ సెల్ఫీ స్టిక్, మ్యాజిక్ షో, ఆర్చరీ, గన్ షూట్, మాట్లాడే చెట్టు తదితర కార్యక్రమాలు ఇందులో జరిపారు. దీంతో పాటు మిస్ కుప్పం, మిస్టర్ కుప్పం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఐడీపీఎస్ డైరెకర్ లోహిత కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ అరుల్‌రాజ్‌లు బహుమతులు అందజేశారు.

స్థానిక సమస్యలపై సీపీఎం ధర్నా



పలమనేరు, మార్చి24 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ కార్యాలయం ఎద సోమవారం సీపీఎం నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. బీసీ, ఎస్సీ కాలనీల్లో రోడ్లు వేయాలని, గంటావూరు, గడ్డూరు కాలనీల్లో మురుగునీటి కాలువలు నిర్మించి రోడ్లు వేయాలని, వీదిదీపాలు వేయాలని, సిల్కుఫారం, ఎస్టీకాలనీ, షికారి కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. అనంతరం మున్సిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ అధ్యక్షుడు గిరిధరగుప్తా, నాయకులు ఈశ్వరరాజా, జయంతి, లక్ష్మయ్య, శ్రీరామయ్య, శేఖర, రత్నమ్మ, సరోజమ్మ, ఖైరున్నీసా, లలిత, గీత, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

భైరెడ్డిపల్లె, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తీర్థం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గంగాధర్(47) ఇటీవల కానుగచెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందారు. గంగాధర్ మృతిపట్ల టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, నాయకులు గోవిందస్వామి, రమేష్, శ్రీనివాసమూర్తి సంతాపం తెలిపారు. సోమవారం వారి కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఒకరికి తీవ్రగాయాలు

పుంగనూరు రూరల్, మార్చి24(ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి... పట్టణంలోని ఏటిగడ్డపాళ్యంకు చెందిన వెంకటరమణ సోమవారం చింతచెట్టు ఎక్కి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్ల సలహాల మేరకు తిరుపతి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

గంగమ్మ కమిటీ సభ్యులకు టీషర్టుల వితరణ

పుంగనూరు రూరల్, మార్చి24: పట్టణంలో మంగళ, బుధవారాల్లో జరిగే సుగుటూరు గంగమ్మ కమిటీ సభ్యులకు దాత భాను ప్రసాద్‌నాయక్ టీషర్టులకు వితణ చేశారు. సోమవారం స్థానిక జమీందార్ ప్యాలెస్ ఆవరణలో కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే జాతరలో వారు అందించే సేవలను గుర్తించి ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలికా సంరక్షణ అందరి బాధ్యత

రామకుప్పం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బాలికా సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని తహశీల్దారు కౌలేష్, ఎంపీడీఓ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ వెంకట మోహన్‌లు కోరారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలికా సంరక్షణ, మహిళల రక్షణపై ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు

సోమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపు సంతలో సోమవారం జానపద వృత్తి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్లు వైద్య పరీక్షలు జరిపారు. 20 మందిని ఆపరేషన్‌కు ఎంపికచేశారు. ఉచిత మందులు అందజేశారు. డాక్టర్ వెంకటరమణ, భార్గవ్‌చంద్ర, రామూర్తి, డాక్టర్ దాసరి నరసింహులు పాల్గొన్నారు.

కందూరులో గంగజాతర

సోమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కందూరులో గంగ జాతర సందర్భంగా సోమవారం నడివీధిలో అమ్మవారిని ప్రతిష్ఠించారు. మహిళలు బోణాలు సమర్పించారు. పొలిమేర అమ్మవార్ల ఆలయాల వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో పార్టీ నేతలు సుబ్రమణ్యం నాయుడు, నాగభూషణం, శ్రీనివాసులు నాయుడు తదితరులు దర్శించుకున్నారు.

టీడీపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేద్దాం

● పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్



టీడీపీ కార్యకర్తకు గుర్తింపు కార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీ మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీని గ్రామ స్థాయినుంచి బలోపేతం చేద్దామని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన పూతలపట్టు నియోజకవర్గ నాయకులతో సమావేశంలో ఆయన ప్రసంగించారు. సంస్థాగత ఎన్నికల ప్రణాళికలో భాగంగా టీడీపీ బలపడాలంటే గ్రామ స్థాయి నుంచి పార్టీ కార్యకలాపాలు మరింత ప్రబలంగా కొనసాగాలని చెప్పారు. కుటుంబ సాధికార సారథుల నియామకం ద్వారా ప్రతి కార్యకర్తకు స్పష్టమైన బాధ్యత కేటాయించబడుతుందని అన్నారు. ఏప్రిల్ 15 లోపు క్లస్టర్, యూనిట్, మండల బూత్, వార్డు కమిటీల నియామకం పూర్తి చేయాలన్నారు. అనంతరం కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. పూతలపట్టు నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 11 అర్జీలు: కమిషనర్



బాధితురాలి నుంచి అర్జీ స్వీకరిస్తున్న నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 11 అర్జీలు వచ్చాయని కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ప్రతి అర్జీపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. శాఖలవారీగా.. ఇంజనీరింగ్‌కు 6, రెవెన్యూకు 3, టౌన్ ప్లానింగ్‌కు ఒకటి, పబ్లిక్ హెల్త్‌కు ఓ అర్జీ చొప్పున అందాయి. సహాయ కమిషనర్ ప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఎంఈ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీలను పరిశీలించిన డీఎస్పీ



చిన్న జంబాడలో ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న డీఎస్పీ అజీజ్

విజయపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిన్న జంబాడ, పాతార్కాడు పరిధిలోని ప్రైవేటు ఫ్యాక్టరీలను సోమవారం డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ పరిశీలించారు. ఫ్యాక్టరీలో ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న నివారణ చర్యలను పరిశీలించి, సూచనలిచ్చారు. సీఐ భాస్కర్, ఎస్ఐ బలరాం తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసవుతున్న యువత: యువత వ్యసనాలకు బానిసవుతోందని నగరి డీఎస్పీ అన్నారు. విజయపురం పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై వెళుతున్న ఎస్ఐ బలరాం, హెడ్‌కానిస్టేబుళ్లు చెంచయ్య, జనార్దన్‌లను సన్మానించారు.

విద్యాసామగ్రి పంపిణీ



యాదమరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వరిగపల్లె ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు రూ.3,000 విలువైన విద్యాసామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం హిమబిందు, పీఆర్టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కె.కనకాచారి, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ శోభ, కోఆప్షన్ మెంబర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

నగరి డివిజన్ రెవెన్యూ సర్వీసెస్ కమిటీ ఎంపిక



ఎంపికైన కమిటీ సభ్యులకు ధ్రువపత్రాలు అందిస్తున్న నాయకులు

నగరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరి డివిజన్ రెవెన్యూ సర్వీసెస్ కమిటీని సోమవారం ఆర్డీవో కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పన్నీరుసెల్వం ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కమిటీ అధ్యక్షుడిగా నగరి డీటీ ధనంజయలు, అసోసియేట్ అధ్యక్షుడిగా నిండ్ర తహసీల్దార్ శేషగిరిరావు, ఉపాధ్యక్షులుగా విజయపురం డీటీ అశోక్, కార్వేటినగరం డీటీ స్వరూపరాణి, నిండ్ర డీటీ నీలావతి, ప్రధాన కార్యదర్శిగా నగరి ఆర్డీవో కార్యాలయ డీటీ గౌరీశంకర్, సంయుక్త కార్యదర్శులుగా మహేశ్, చంద్రయ్య, కృష్ణతేజ, కోశాధికారిగా రెడ్డియప్పన్ ఎంపికయ్యారు.

ఇళ్ల పట్టాలపై విచారించండి: టీడీపీ



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న నాగరాజు

శ్రీరంగరాజపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తయ్యూరు పంచాయతీ బసివిరెడ్డిపల్లె వద్ద చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి పక్కన ఉన్న జగనన్న కాలనీలో అనర్హులకు ఇచ్చిన పట్టాలపై విచారణ చేపట్టాలని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు నాగరాజు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు లోకనాథం పిళ్లైకి ఫిర్యాదు చేశారు. అలాగే ఎన్టీఆర్ కాలనీకి 76 సర్వే నెంబరులో 30 సెంట్లు, చొక్కమడుగు అంబేడ్కర్ నగర్ కాలనీకి గతంలో సర్వే నెంబరు 97/4లో సుమారు 40 సెంట్లు శ్మశానానికి స్థలం కేటాయిస్తే, అదే గ్రామానికి వైసీపీ నాయకుడు ఈ స్థలంలో టెంకాయ చెట్లు నాటేశారని నియోజకవర్గం టీడీపీ ఎస్సీ సెల్ కార్యదర్శి ఎన్.కుమార్ ఫిర్యాదు చేశారు. విచారిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి



యువకులకు సూచనలిస్తున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళ్యం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సీఐ కత్తి శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని యువకులతో సమావేశం నిర్వహించారు. డ్రగ్స్ వాడితే తలెత్తే నష్టాలపై అవగాహన కల్పించారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

లారీ బోల్తా: డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



బోల్తాపడ్డ లారీ

బంగారుపాళ్యం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లారీ బోల్తాపడిన ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అరక్కోణం నుంచి కోలార్‌కు టైల్స్ లోడుతో వెళుతున్న లారీ సోమవారం వేకువ జామున చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి కొత్తపల్లె ఫ్లైఓవర్ సమీపానికి వచ్చేసరికి చెన్నై నుంచి హసన్‌కు వెళుతున్న కంటైనర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో టైల్స్ లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడటంతో డ్రైవర్ మణికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు

చిత్తూరు కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగర్‌కాలనీలో జిల్లా సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. సేవాసమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, ఆర్.శేషనారాయణ, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

టూటౌన్ ఎస్ఐగా వెంకటరమణ

చిత్తూరు అర్బన్/విజయపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు టూ టౌన్ ఎస్ఐగా వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఈయన వీఆర్‌లో ఉన్నారు. కాగా, ఇక్కడ ఎస్ఐగా ఉన్న ప్రసాద్ బంగారుపాళ్యంకు బదిలీపై వెళ్లారు.

విజయపురానికి రంగా: విజయపురం ఎస్ఐగా రంగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

దగ్ధమవుతున్న అడవులు

అటవీ అధికారులు పట్టించుకోవడం లేదంటున్న జనం



బెస్తపల్లె వద్ద దగ్ధమవుతున్న అడవి

ఐరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలో అడవులు దగ్ధమవుతున్నా పోతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఒక్కరోజే తూర్పున బెస్తపల్లె, పడమర వైపు రంగమ్మచెరువు తదితర అటవీప్రాంతాలు దగ్ధమయ్యాయని తెలిపారు. గతంలో ఎక్కడైనా అడవికి ఎవరైన నిప్పు పెడితే వెంటనే ఫైరింజన్లు వచ్చి మంటలను అదుపు చేసేవన్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించకుంటే చాలా అడవులు అగ్నికి ఆహుతవుతాయని వాపోతున్నారు.

కట్టమంచి చెరువు సుందరీకరణ పనులు వేగంగా చేయండి

● చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్



పనుల పురోగతిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కట్టమంచి చెరువులో పూడికతీత, సుందరీకరణ పనులు వేగంగా చేపట్టాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదేశించారు. సోమవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. పూడికతీత పనులకు కలెక్టర్ ఇదివరకే ఆదేశాలిచ్చారని, వెంటనే పూర్తి చేయాలని కోరారు. చెరువులో నీళ్లను ఎక్కువగా నిల్వ ఉంచేలా చూడాలన్నారు. ఇదే సమయంలో ఎన్టీఆర్ జలాశయం నీళ్లతో కట్టమంచి చెరువును నింపి.. చెరువు పరిధిలోని బోర్లను రీచార్జి చేయాలన్నారు. చెరువు నిండితే బోటింగ్ ఏర్పాటు చేద్దామన్నారు. ఇరిగేషన్ ఈఈ మురళి, ఈఈ హీరాలాల్, ఏఈ హీరా తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత



బాధితుడికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నిండ్ర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అగరం, అత్తూరు పంచాయతీల్లో అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి సీఎం సహాయనిధి నుంచి రూ.1,78,450 చెక్కులను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. అత్తూరుకు చెందిన ధనుష్‌కు రూ.31,377, భాగ్యమ్మకు రూ.43,961, అగరం దళితవాడకు చెందిన దొరబాబుకు రూ.1,03,117 చెక్కులను అందజేశామన్నారు. టీడీపీ నాయకులు వెంకటేశ్వరరావు, రవినాయుడు, పురుషోత్తం నాయుడు, రమేష, కుప్పయ్య, గాలి రమేష్‌నాయుడు, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సంపూర్ణ పోషకాలు అందించాలి

ఐరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు అంగన్‌వాడీలు నవచేతన్ ద్వారా సంపూర్ణ పోషకాలను అందించాలని అంగన్‌వాడీలకు ఐసీడీఎస్ సీడీపీవో నిర్మల అన్నారు. సోమవారం పొలకల అంగన్‌వాడీ కేంద్రంలో ఐరాల, పూతలపట్టు అంగన్వాడీ కేంద్రాలలో పని చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు పోషన్‌బీ పడాయిబీ కార్యక్రమం మూడు రోజుల శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. సూపర్‌వైజర్లు మంజుల, లావణ్య పాల్గొన్నారు.

నగరి: చింతలపట్టెడ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో కృష్ణవేణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరిమాని గంగమ్మ హుండీ ఆదాయం రూ.1.20లక్షలు



శ్రీరంగరాజపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆరిమాని గంగమ్మ ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు జిల్లా దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో జరిగింది. జనవరి నుంచి మార్చి వరకు హుండీ ఆదాయం రూ.1.20లక్షలు వచ్చినట్లు ఆలయ ఈవో తిమ్మారెడ్డి తెలిపారు. అర్చకుడు హిమాచలపతిరెడ్డి, జలంధర్ నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, వెంకటరమణ, రవి, దామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంగారు నగల చోరీపై కేసు నమోదు

చిత్తూరు అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బంగారు నగల చోరీపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య తెలిపిన వివరాల మేరకు.. బైరెడ్డిపల్లె మండలం కడపనత్తం గౌనితిమ్మేపల్లె గ్రామానికి చెందిన రెడ్డెమ్మ గతనెల 5వ తేదీన తన కుమార్తెను డెలివరీ కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చింది. ఆ సమయంలో కుమార్తె ఒంటిపై ఉన్న నగలను తీసి బ్యాగులో పెట్టుకుంది. డెలివరీ అయ్యాక ఇంటికెళ్లిపోయారు. ఇటీవల బ్యాగులో చూడగా నగలు కనిపించలేదు. ఈ నేపథ్యంలో 30 గ్రాముల నగలు చోరీకి గురయ్యాయని సోమవారం టూటౌన్ పోలీసులకు రెడ్డెమ్మ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టీడీపీ నేత జన్మదిన వేడుకలు

పూతలపట్టు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలం టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు దాము జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. కొంకా నాగరాజు, దామోదర్, మంజునాథ్, మునస్వామి, చిట్టి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న సర్పంచ్ భగవతి

యాదమరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీబీ ఫ్రీ పంచాయతీగా ఓటేరుపల్లె గ్రామపంచాయతీ ఎంపికైంది. దీంతో సోమవారం చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో సర్పంచ్ పత్తిపాటి భగవతి, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, ఏఎన్ఎం మహేశ్వరిలకు డీఎంహెచ్‌వో సుధారాణి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జిల్లా టీబీ నివారణ అధికారి వెంకట ప్రసాద్ ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందజేసి, అభినందించారు.

31న శక్తి మారియమ్మ ఆలయ కుంభాభిషేకం

చిత్తూరు కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గిరింపేట గంగినేని చెరువు కట్ట సమీపంలోని శక్తి మారియమ్మ ఆలయ మహా కుంభాభిషేకం ఈనెల 31వ తేదీ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

గుడిపాల మండల మీట్ మళ్లీ వాయిదా

గుడిపాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండల సర్వసభ్య సమావేశం మళ్లీ వాయిదా పడింది. సోమవారం జరగాల్సిన సమావేశానికి కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో శివరాజన్ తెలిపారు. ఇలా వాయిదా పడటం మూడోసారి కావడం గమనార్హం.

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు



విద్యార్థులకు పెన్నులు వితరణ చేస్తున్న దాతలు

బంగారుపాళ్యం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని ఇంటర్నేషనల్ క్రికెట్ క్రీడాకారుడు (పారా ఒలంపిక్) గణేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో రిచర్ఫ్ సంస్థ, చిత్తూరు వారి ఆధ్వర్యంలో డౌన్ సిండ్రోమ్ అండ్ ఆటమ్ అవేర్నెస్ ప్రోగ్రామ్ జరిగింది. గణేష్ మాట్లాడుతూ.. తనకు కూడా శారీరక వైకల్యం ఉన్నా బీటెక్ వరకు చదివి, బ్యాంకు ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పారు. అనంతరం రిచర్ఫ్ సంస్థ వారు విద్యార్థులకు క్యారమ్ బోర్డు, పెన్నులు, నోట్ పుస్తకాలను వితరణ చేశారు. రిచర్ఫ్ సంస్థ కో-ఆర్డినేటర్ కోదండపాణి, హెచ్‌ఎం అమూల్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ కార్యాలయంలో ఎస్ఈ తనిఖీలు



ఏఈ నీరజను అభినందిస్తున్న ఇస్మాయిల్ అహ్మద్ తదితరులు

చిత్తూరు రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్ డివిజన్ విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆధ్వర్యంలో వార్షిక తనిఖీ నిర్వహించారు. క్యాష్, టెక్నికల్, కమర్షియల్, వర్క్‌ఆర్డర్ల వివరాలను ఆరా తీశారు. ఈఈ మునిచంద్ర, టెక్నికల్ ఈఈ జగదీష్, పీవో ప్రసన్న ఆంజనేయులు, ఏవో రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇటీవల గుంటూరులో జరిగిన విద్యుత్ శాఖ రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో ఐరాల ఏఈ నీరజ అన్ని క్రీడా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చూపారు. ఈమెను ఎస్ఈ, ఈఈ, ఏఈలు అభినందించారు.

ఘనంగా సీకే బాబు జన్మదిన వేడుకలు

చిత్తూరు సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే సీకే బాబు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళి మోహన్, టీడీపీ నేతలు వసంత్ కుమార్, మోహన్‌రాజ్, మేషాక్, వెంకటేష్ చౌదరి, దొరబాబు చౌదరి, మోహన్ నాయుడు తదితరులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

జోరుగా రోడ్డు పనులు



పానాటూరు వద్ద జరుగుతున్న రోడ్డు పనులు

గుడిపాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలోని పానాటూరు వద్ద రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. గత కొన్నేళ్లుగా రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతుండడంతో కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తీసుకెళ్లి సుమారు రూ.ఐదు కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పుడు ఆ పనులు చురుగ్గా సాగుతున్నాయి. తమిళనాడు సరిహద్దులోని గొల్లమడుగు వద్ద రోడ్డుకు ఇరువైపులా వెడల్పు చేయడంతోపాటు కొత్త రోడ్డును వేయడానికి చర్యలు చేపడుతున్నారు. దీంతో ఇటు ప్రయాణికులు, అటు వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్షయవ్యాధి నివారణకు కృషి చేద్దాం

నగరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నివారణకు కృషి చేద్దామని నగరి ఏరియా వైద్యశాల ఆర్ఎంవో డాక్టర్ మంజుల పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నివారణ దినం సందర్భంగా సోమవారం ఏరియా వైద్యశాల వద్ద నిర్వహించిన ర్యాలీలో వైద్యులతో కలిసి పాల్గొన్నారు. వైద్యులు కార్తికేయన్, జయంత్, ప్రవీణ, లోకేష్, మహేష్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



నగరి ఏరియా వైద్యశాలలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

విజయపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణంలో వైద్యసిబ్బంది ర్యాలీ, విజయపురం కూడలిలో మానవహారం నిర్వహించారు. వైద్యాధికారి విష్ణుప్రియ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం కత్తెరపల్లెలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో రాజేశ్వరి, ఆరోగ్య పర్యవేక్షకులు త్యాగరెడ్డి, పీహెచ్ఎన్ గౌరీ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పాలసముద్రం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పాలసముద్రం బీసీ కాలనీ వరకు డాక్టర్ మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యాదమరి: మండలకేంద్రంలో సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు సెల్వరాణి, లక్ష్మీపతి, ఎంఎల్‌హెచ్‌పీలు, మహిళా ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిపాల: ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి సంధ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది విజయ, చంద్రశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిండ్ర: మండల కేంద్రంలో వైద్యాధికారులు సుమలత, వినీషా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో కలిసి పురవీధుల్లో డాక్టర్ ప్రవీణ్ ర్యాలీ నిర్వహించారు. బస్టాప్ కూడలిలో మానవహారం నిర్వహించారు. సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్ ధర్మేంద్ర, హెల్త్ అసిస్టెంట్ జయకుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఐరాల ఇన్‌చార్జి ఎంపీడీవోగా భువనేశ్వరి

ఐరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఐరాల ఇన్‌చార్జి ఎంపీడీవోగా భువనేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో ధనలక్ష్మి వచ్చేనెల ఏడో తేదీ వరకు సెలవు పెట్టడంతో భువనేశ్వరికి బాధ్యతలు అప్పగించారు. ఈమె ప్రస్తుతం ఇక్కడే అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

పెనుమూరు ఎస్ఐగా రామచంద్రయ్య

పెనుమూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు ఎస్‌గా రామచంద్రయ్య బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ 10 నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉండటంపై ఆంధ్రజ్యోతిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనికి తోడు టీడీపీ, జనసేన నేతలు కూడా అధికారులకు విన్నవించారు. ఈ నేపథ్యంలో చిత్తూరు వీఆర్‌లో ఉన్న జి.రామచంద్రయ్యను పెనుమూరు ఎస్ఐగా ఎస్పీ మణికంఠ నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఈయన సీఐ, డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

పూతలపట్టు ఏపీవోగా ఇందు

పూతలపట్టు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఏపీవోగా ఇందు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీవోగా పనిచేస్తున్న సంధ్యారాణి యాదమరికి బదిలీపై వెళ్లడంతో వెదురుకుప్పం ఏపీవోగా ఉన్న ఇందును నియమించారు.

స్పోర్ట్స్ కిట్ వితరణ



ఐరాల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఐరాలలోని భవిత కేంద్రంలోని విద్యార్థులకు రీడ్స్ సంస్థ వారు స్పోర్ట్స్, ఎడ్యుకేషన్ కిట్లను సోమవారం వితరణ చేశారు. ఆ సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ కోదండపాణి, ఐరాల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి, భవిత స్కూల్ టీచర్లు కవిత, సురేష్ పాల్గొన్నారు.

సన్మానం

పాలసముద్రం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తుండిన ఖాదర్‌బాషా చిత్తూరు వన్‌టౌన్‌కు బదిలీ అయ్యారు. దీంతో సోమవారం ఆయన్ను ఎస్ఐ చిన్నరెడ్డెప్ప ఆధ్వర్యంలో సన్మానించారు. ఏఎస్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ జోలికెళితే కఠిన చర్యలు: ఎస్ఐ

శ్రీరంగరాజపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ జోలికెళితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సుమన్ హెచ్చరించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. బెట్టింగ్‌కు పాల్పడే వారిని జైలుకు పంపిస్తామన్నారు.

సిద్ధేశ్వరుడికి క్షీరాభిషేకం



వెదురుకుప్పం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎగువ కన్నికాపురం వద్ద ఉన్న మరకతవల్లి సమేత స్వయంభు సిద్దేశ్వరస్వామికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు. అలాగే చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



గోపికి ఆర్థికసాయం అందిస్తున్న వెంకటేష్

నగరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగరి మండలం వీకేఆర్‌పురం వద్ద రెండ్రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమేశ్వరి(10) మృతి చెందగా, మహేష్ గాయపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరి తండ్రి గోపికి రూ.5000 ఆర్థిక సాయాన్ని నగరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేష్ సోమవారం అందజేశారు. అలాగే మహేష్‌కు మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వాసు, గణేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.